నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నల్లగొండ
శనివారం | ఫిబ్రవరి 08, 2025 | www.navatelangana.com

నూతన పెట్రోల్ బంక్ ప్రారంభం



నవతెలంగాణ-నాంపల్లి

మండల కేంద్రం నుండి కొండమల్లేపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో తిరుమలగిరి గ్రామ పంచాయతీ పరిధిలో చల్లవానికుంట గేటు వద్ద గండికోట యాదయ్య-మంజుల దంపతులు నూతనంగా ఏర్పాటుచేసిన నయారా పెట్రోల్ బంకును శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి నాంపల్లి సబ్ ఇన్స్పెక్టర్ మొగుళ్ళ శోభన్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, వ్యాపారులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-చిట్యాల



డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సే నో టు డ్రగ్స్ అనే ప్రచారంతో కూడిన క్యాలెండర్ ను పట్టణ కేంద్రం లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వడ్డగాని మహేష్ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ నిర్మూలన కోసం యువతను చైతన్యం చేయడం కోసం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖతో అవగాహన సదస్సులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘంపట్టణ అధ్యక్షుడు అవిశెట్టి కిరణ్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి జిట్టా సురేష్, నాయకులు జిట్టా దినేష్, వెంకన్న, సాయి, గోపి, భరత్, వెంకటేష్, నాగరాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రస్తుతం ప్రకృతి వాతావరణంలో తీవ్ర మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఎండాకాలలో వానలు, వానాకాలంలో ఎండలు, సకాలంలో శీతాకాలం రాకపోవడంతో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. గతంలో ముందుగా పంట సాగు చేస్తే అధిక దిగుబడి రావడంతో ఈ సారి కూడా ముందుగానే పంటలను సాగు చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆయా కంపెనీలు నాణ్యత లేని వరి విత్తనాలను రైతులకు అంటగట్టారు. ఇప్పుడు ఆ విత్తనాలు వాడిన పంట పొలాలు తక్కువ కాలంలోనే పంట పొట్ట దశకు రావడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తల్లి కర్ర ఎదుగుదల లేకపోవడం, వరి గింజ గట్టికాకపోవడం తో పాటు చలి కారణంగా తెగుళ్లు సోకి దిగుబడిపై ప్రభావం పడే అవకాశం కనిపిస్తోంది. లక్షలు ఖర్చుపెట్టి పంటను సాగు చేస్తే చివరికి ఈ యాసంగి నష్టం కల్గిస్తుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

- 35 రోజులకే పొట్ట దశకు వరి చేలు
- తెగుళ్లతో తగ్గనన్న దిగుబడి
- ఆందోళనలో అన్నదాతలు
- కరువైన వ్యవసాయాధికారుల సూచనలు

అన్నదాతల ఆశలు ఆవిరి

నవతెలంగాణ-మిర్యాలగూడ

ప్రతి ఏటా యాసంగి సీజన్‌లో నవంబర్ చివరివారం లేదా డిసెంబర్ మొదటి వారంలో నాట్లు వేసేవారు. కాని ఈ ఏడాది సాగర్ ప్రాజెక్టులో పుష్కలంగా నీరు ఉండడంతో సాగునీరు వస్తుందన్న ఆశతోపాటు తక్కువ కాలంలో పంట చేతికొచ్చే వరి విత్తనాలను సాగు చేశారు. తక్కువ కాలంలో పంట చేతికొచ్చే వివిధ ప్రైవేట్ కంపెనీలు హైబ్రిడ్ వంగడాలు పేరిట చిట్టి పొట్టి, 101, కావేరి, అంకూర్, పద్మ, జైశ్రీరామ్, హెచ్ఎంటీ తదితర 20 నుంచి 30 కంపెనీలకు చెందిన సీడ్స్‌లతో రైతులు సాగు చేసినట్లు సమాచారం. కనీసం 90 నుంచి వంద రోజులు పండే పంటను వేసుకోవాలనుకున్న రైతులకు 35 రోజులకే పంట చేతికి రావడంతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు. కంపెనీలు, డీలర్లు అందించిన విత్తనాలు నాణ్యత లేకపోవడం తోడు ప్రకృతి, వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో వరిపంటపై తీవ్ర ప్రభావం పడింది. 35రోజులకే పంట పొట్టదశకు చేరుకోవడం, తల్లికర్ర ఎదుగుదల లేకపోవడం, వరి గింజ గట్టికాకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఎకరాకూ 30 నుంచి 40బస్తాలు పంట దిగుబడి రాగా ప్రస్తుతం పరిస్థితులో విత్తనం, ప్రకృతి వైపరిత్యాల కారణంగా దిగుబడి పూర్తిగా తగ్గే అవకాశముంది.

ఉమ్మడి జిల్లాలో 12.73 లక్షల ఎకరాల సాగు

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా సుమారు 12.73 లక్షల ఎకరాల్లో వరిపంటను సాగు చేశారు. ఇందులో నల్లగొండ జిల్లాలో 5.11లక్షల ఎకరాలు సాగు చేయగా సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా 4.82లక్షలు, యాదాద్రి భువనగిరిలో జిల్లాలో 2.80లక్షల ఎకరాల్లో సాగు చేశారు. విత్తనాలను అందించిన కంపెనీలు నాసిరకం విత్తనాలను ఇవ్వడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆరోపిస్తుండగా కొన్ని చోట్ల ముందస్తుగా, మరికొన్ని చోట్ల ఆలస్యంగా సాగు చేయడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

7 మండలాల్లో వేలాది ఎకరాల్లో ప్రభావం

ఉమ్మడి జిల్లాలోని నల్లగొండ, సూర్యాపేటలో తెగుళ్ల ప్రభావం తీవ్రంగా ఉంది. ప్రధానంగా సూర్యాపేట జిల్లాలో పెన్‌పహాడ్, నడిగూడెం, మునగాల, కోదాడ, నేరేడుచర్ల, పాలకీడు మండలాల్లో, నల్లగొండ జిల్లాలోని మాడ్గులపల్లి మండలంలోని అనేక గ్రామాల్లో నాటు వేసిన 25 రోజుల తరువాత తల్లి కర్ర ఈనడం ప్రారంభించింది. దీంతో పంట దిగుబడిపై పెను ప్రభావం పడే అవకాశం ఉంది. యాదాద్రి భువనగిరి జిల్లా లో ఈ ప్రభావం లేదని జిల్లా అధికారి ఒకరు తెలిపారు. వేలాది ఎకరాల్లో పంట ముందుగానే పొట్ట దశకు వచ్చింది.. ఈ పొలాల్లో దిగుబడి తగ్గే అవకాశం ఉన్నది. కానీ అధికారులు మాత్రం తక్కువగానే పంటపొలాలకు ఈ ప్రభావం ఉన్నదని చెపుతున్నారు.

కరువైన వ్యవసాయాధికారుల సూచనలు

వరిచేలు ముందుగా పొట్ట దశకు రావడం, తెగుళ్ళ బారిన పడి నష్టపోతుంటే వ్యసాయాధికారులు మాత్రం చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. పంట సాగు చేసేటప్పుడే రైతులకు సూచనలు, సలహాలు ఇవ్వాల్సిన వ్యవసాయాధికారులు పట్టించుకోకపోవడంతో సాగు చేసే విత్తనాల విషయంలో కూడా జాగ్రత్తలు చూపకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. పంట ఎదుగదల లేదని, గింజ గట్టి కావడంలేదని, తెగుళ్ల బారిన పడుతుందని, దిగుబడి తగ్గే అవకాశం ఉందని పలుమార్లు రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన సలహాలు, సూచనలు ఇవ్వడంలో విఫలమయ్యారని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా యూరియాను అధిక మోతాదులో చల్లడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందని రైతులపై నెపం నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ముందుగా వచ్చిన పొట్ట దశ పంట, తెగుళ్ల విషయంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి నష్ట నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. విత్తనం అందించిన కంపెనీల వారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

3ఎకరాల్లో పంట సాగు చేశా...

కొప్పుల సైది రెడ్డి (గంధ్రవారి గూడెం, మాడుగుల పల్లి)



మూడెకరాల్లో పంట సాగు చేశా...నాటు వేసిన 35 రోజుల్లోనే పొలం ఈనుతుండడంతో ఏం చేయాలో అర్థం కావడం లేదు. మూడెకరాల్లో హైబ్రిడ్ అంటే మహేంద్ర చింట్లు వరి విత్తనాలు వేశాను.తీరా ఇప్పుడు పంట పొట్ట దశకు రావడం, గింజ గట్టి పడకపోవడంతో భయం వేస్తోంది. అధికారులు, శాస్త్రవేత్తలకు చూపించినా నివారణ చెప్పడం లేదు. ఏం చేయలేని పరిస్థితి ఉంది. వాతావరణ మార్పులని, సీడ్ సమస్య అని చెప్తున్నారు. ఈ సారి పెట్టినపెట్టుబడులు సైతం వెళ్లే పరిస్థితి లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

వాతావరణ మార్పుతోనే

శ్రవణ్‌కుమార్ (జిల్లావ్యవసాయాధికారి)



నల్లగొండ జిల్లాలో పంటపొలాలు వాతావరణ మార్పు కారణంగా కొన్ని గ్రామాల్లో నాటేసిన స్వల్పకాలంలోనే పొట్ట దశకు చేరుకున్నాయి. కొంతమంది రైతులు స్వల్పకాలిక వరి వంగడాలను నారు పోసిన 25రోజుల్లోపు నాటువేయాల్సి ఉండగా 30 నుంచి 40రోజుల వ్యవధిలోనే నాట్లు వేయడం వల్ల వరిపొలాలు ఇలా పొట్టదశకు వచ్చే అవకాశం ఉంది. పంట పొలాలను పరిశీలించి పంట దిగుబడి పెంచేందుకు సూచనలు అందిస్తాం.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా నిర్వహించాలని నల్గొండ జిల్లా అదనపు కలెక్టర్ , వరంగల్ ,ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి జె. శ్రీనివాస్ కోరారు. శుక్రవారం నల్గొండ జిల్లా కలెక్టర్ ర్యాలయావరణలోని ఉదయాదిత్య భవన్లో వరంగల్,ఖమ్మం,నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల విధులకు నియమించబడిన పిఒ,ఏపిఒ, సూక్ష్మ పరిశీలకుల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం జారీ చేసిన పిఒ హ్యాండ్ బుక్‌ను బాగా చదవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రంలో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రదర్శింప చేయడం, అభ్యర్థుల ఏజెంట్ల జాబితా పరిశీలన, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన ప్రకారం ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించడం వంటి అన్ని అంశాల పట్ల పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అంతేకాక బ్యాలెట్ బాక్సులు ముందే తనిఖీ చేసుకోవాలని , పోలింగ్ కు ముందే ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్స్ లు తెరిచి చూపించాలని, అప్పుడే ఎన్నికలను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు వారికి తెలుస్తుందని అన్నారు. ప్రాధాన్యత క్రమంలో ఓటర్లు ఓటు వేయవలసి ఉంటుందని, ఇందుకు ఎన్నికల కమిషన్ అంగీకరించిన వైలెట్ కలర్ స్కెచ్ పెన్ మాత్రమే వాడాలని ఈ విషయం ముందే ఓటర్లకు తెలియజేయాలని చెప్పారు. ఎట్టి పరిస్థితులలో ఎన్నికల నిర్వహణ పట్ల నిర్లక్ష్యం వహించవద్దని పూర్తి జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాల్సించాలని సూచించారు. ఈ సమావేశంలో నల్గొండ ఆర్డీఓ వై. అశోక్ రెడ్డి, ఎల్‌డీఎం శ్రామిక్,ఎన్నికల శిక్షకులు కొండమల్లేపల్లి ఎంపీడీవో బాలరాజు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మండల స్థాయి కబడ్డీ పోటీలు

నవతెలంగాణ-మర్రిగూడ

మిషన్ పరివర్తన్-యువతేజం కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశానుసారం మర్రిగూడ పోలీస్ ఆధ్వర్యంలో నిర్వహించబోయే మండల స్థాయి కబడ్డీ పోటీలను గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్సై ఎం.కృష్ణారెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తూ,వ్యక్తుల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందిస్తాయని,యువత చదువుతోపాటు,క్రీడల పట్ల ఆసక్తి కనపరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఆయా గ్రామాల క్రీడాకారులు,తదితరులు పాల్గొన్నారు.

నేడు నవోదయ ప్రవేశ పరీక్ష

నవతెలంగాణ-పెద్దవూర

పెద్దవూర మండలం చలకుర్తి క్యాంపులో వున్నజవహర్ నవోదయ విద్యాలయ 2025-26 విద్యా సంవత్సరంలో 9వ,11వ తరగతుల నందు ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసేందుకు నేడు జరిగే పరీక్షా కేంద్రాల నందు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు విద్యాలయ ప్రిన్సిపల్ ఆర్ నాగభూషణం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతి ప్రవేశానికై 652 మంది బాలురు,424 మంది బాలికలు మొత్తం 1076 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ రీక్షను నల్గొండజిల్లా కేంద్రం లోని నల్గొండ పబ్లిక్ స్కూల్,సెయింట్ ఆల్ఫోన్సస్ హై స్కూల్, గవర్నమెంట్ బాయ్స్ హై స్కూల్ దేవరకొండ రోడ్డు, జవహర్ నవోదయ విద్యాలయ పెద్దవూర మండలం చలకుర్తి క్యాంపులో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అలాగే 11వ తరగతి నందు ప్రవేశానికై 1265 మంది బాలురు, 1337 మంది బాలికలు మొత్తం 2602 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ పరీక్షను సూర్యాపేట జిల్లాకేంద్రం లో ఏవీఎంగర్ల్స్ హై స్కూల్,తెలంగాణ మోడల్ స్కూల్, ఇమాంపేట, జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల సూర్యాపేట, కాకతీయ హై స్కూల్,సిటీ టాలెంట్ హై స్కూల్, గవర్నమెంట్ ఎంఎఎం హై స్కూల్,జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాల నియర్ మున్సిపల్ ట్యాంక్, గవర్నమెంట్ హై స్కూల్ నెంబర్ 02 సూర్యాపేట జిల్లా, కేవీఎస్ బీఎం జెడ్పి హెచ్ ఎస్ కోదాడ, జడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాల కోదాడ,సెంట్ జోసెఫ్ సిసిఆర్ హై స్కూల్ కోదాడ లో పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

రమాబాయి అంబేద్కర్ గొప్ప త్యాగమూర్తి

నవతెలంగాణ-మునుగోడు



అణగారిన వర్గాలకు జరుగుతున్న అన్యాయాలపై అంబేద్కర్ జ్ఞాన యుద్ధం చేసేందుకు వెళ్లగా నలుగురు బిడ్డలను పోగొట్టుకున్న ఒక మహాతల్లి రమాబాయి అంబేద్కర్ అని పెరుమాళ్ల ప్రమోద్‌కుమార్ అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సతీమణి మాతా రమాబాయి అంబేద్కర్ 127వ జయంతి సందర్భంగా మునుగోడు అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యములో మాతా రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు..ఆమె సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమములో పెరుమాళ్ల ప్రమోద్ కుమార్,రెడ్డిమళ్ల యాదగిరి, ముచ్చపోతుల శ్రీకాంత్,నిరుడు సైదులు, బొల్లు సైదులు,పెరుమాళ్ల ప్రణయ్ కుమార్,బెల్లపు బాల శివరాజ్, రెడ్డిమల్ల వెంకట్, బసనగ్గర రాము, జంగిలి నాగరాజు, గాలి జీవన్, బెల్లపు ప్రసాద్, ముచ్చపోతుల పవన్ అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సరంపేటకు ఎంపీటీసీ స్థానం ఏర్పాటు పై హర్షం

నవతెలంగాణ-మర్రిగూడ



మండలంలోని సరంపేట గ్రామాన్ని నూతన ఎంపీటీసీ స్థానంగా ఏర్పాటు చేయడంపై సరంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ యువజన నాయకులు వర్కాల వెంకటేష్ హర్షం వ్యక్తం చేశారు.గురువారం స్థానికంగా ఆయన మాట్లాడారు. సరంపేట ఎంపీటీసీ స్థానానికి సమీప గ్రామాలైన మేటి చందాపురం, కొట్టాల గ్రామాలను కలపడంతో గ్రామ అభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఎంపీటీసీ స్థానం ఏర్పాటుకు సహకరించిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, మండల నాయకులకు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగులు నా కుటుంబ సభ్యులు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నవతెలంగాణ-నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి



ఉద్యోగులు తన కుటుంబ సభ్యులలాంటి వారిని ఎల్లప్పుడూ వారికి తన వంతు సహకారం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం ఆమె నల్గొండ జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, నల్గొండ జిల్లా శాఖ రూపొందించిన టి జి ఓ డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిదన్నారు. జిల్లాలో టీజీవో భవన నిర్మాణానికి స్థలాన్ని గుర్తిస్తే వెంటనే కేటాయిస్తామని ఆమె తెలిపారు .అభివృద్ధి ,సంక్షేమ కార్యక్రమాల అమలులో గజిటెడ్ అధికారులు ఎప్పటికప్పుడు తమ వంతు కృషి చేస్తూ నల్గొండ జిల్లాను మరింత అభివృద్ధి పథంలో తీసుకు వెళ్ళేందుకు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో జిల్లా గజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ తో పాటు, రాష్ట్ర గెజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు (పేర్ల జాబితా జత చేయనైనది)తదితరులు. మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా గజిటెడ్ అధికారుల సంఘం సభ్యులు,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకం

ఆంధ్ర ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వర ప్రసాద్

నవతెలంగాణ-మిర్యాలగూడ



తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేపట్టడం ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకమని ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు .శుక్రవారం మిర్యాలగూడకు వచ్చిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 30 ఏండ్ల పాటు మందకృష్ణ మాదిగ చేసిన సుదీర్ఘ పోరాట ఫలితంగా తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ చేశారని చెప్పారు. మందకృష్ణ మాదిగకు వచ్చే సంవత్సరం పద్మ విభూషణ్ అవార్డు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో బీసీ కులగణన చేపట్టడం రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఒక అడుగు ముందుకు వేసిందని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ చేసే విషయంలో కొన్ని లోటుపాట్లు జరిగాయని వాటిని సవరించేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని కోరారు. అట్టడుగు ఉప కులాలు ఏ గ్రేడ్ లో ఉండాల్సింది పోయి సీ,డీ గ్రేడ్ లో వేశారని, సీ,డీ గ్రేడ్ లో ఉండాల్సిన ఉపకులాలు ఏ గ్రేడ్ లోకి వచ్చాయని వీటిని పునం పరిశీలించి సవరించాలని కోరారు. మాదిగలకు 11 శాతం మాలలకు ఐదు శాతం రిజర్వేషన్ కేటాయించారని భవిష్యత్తులో పెంచే రిజర్వేషన్‌ను మాదిగలకు వర్తించే విధంగా చూడాలని కోరారు. రాజకీయ నామినేటెడ్ పదవులలో ప్రాధాన్యత కల్పించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మాదిరిగానే ఆంధ్రాలో ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి ఒప్పుకుంటే ఆంధ్ర రాజధానిలో రేవంత్ రెడ్డి తో పాటు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు సన్మానిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీటీసీ రాపోలు నర్సయ్య ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు దైద సత్యం, తెడ్ల రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గీతా మందిరంలో లక్ష పుష్పార్చన వేడుకలు

నవతెలంగాణ-నకిరేకల్



గీతా మందిర 27వ వార్షికోత్సవం వేడుకలో భాగంగా శుక్రవారం రెండవ రోజు శ్రీకృష్ణ పరమాత్మునికి 108 మంది భక్తులతో లక్ష పుష్పార్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు దైద రవీందర్, మున్సిపల్ చైర్మెన్ రజిత శ్రీనివాస్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివానంద స్వామి, దయానంద స్వామి, గీత మందిరం అధ్యక్షుడు పబ్బతి వెంకన్న, మంచు కొండ సోమయ్య, కొత్తూరు వెంకటేశ్వర్లు, వీర్లపాటి జానయ్య, బచ్చు హనుమంతు, కూరెళ్ళవెంకన్న, సోమ సక్కుబాయి, సోమగీత, భక్తులు పాల్గొన్నారు.

చెర్వుగట్టులో అగ్నిగుండాల ఘట్టం

భారీ భద్రత నడుమ విజయవంతం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల పరిధిలోని చెరువుగట్టులోగల శ్రీ పార్వతి జడల రామలింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున అగ్నిగుండాల ఘటం ను ఆలయ అధికారులు, పోలీస్ శాఖ సమన్వయంతో నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో ప్రధాన ఘట్టమైన స్వామివారి కల్యాణానంతరం అగ్నిగుండాలకు అంతటి ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ అగ్ని గుండాల వెంట భక్తులు నడిచినచో పాపాలు వైదోలుగునని, అనారోగ్య సమస్యలు తీరునని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ అగ్ని గుండాల కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు శివసత్తులు పాల్గొని, ఒకరికొకరు పోటీపడుతూ అగ్ని గుండంలోని నిప్పుల మీద నడుచుకుంటూ వెళ్లడానికి భక్తులు పోటాపోటీపడ్డారు. . భక్తులు అగ్నిగుండంలో నడిచారు . ఈ కార్యక్రమం కి ముందుగా పార్వతి పరమేశ్వరులను పర్వత వాహనంపై ఊరేగింపుగా అగ్నిగుండెం స్థలం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిప్పులపై భక్తులు నడిచే సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భక్తుల రద్దీకి అనుగుణంగా దేవాదాయ శాఖ, పోలీస్ శాఖలు తగిన ఏర్పాట్లను చేశారు.



తీసుకున్న జాగ్రత్తలు

అగ్నిగుండంలోని నిప్పులపై నడిచే భక్తులకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందు జాగ్రత్తగా డిఎస్పి శివరాం రెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయశాఖ చర్యలు చేపట్టింది. అగ్ని మాపక శాఖ, ఆరోగ్య శాఖ సిబ్బంది అగ్ని గుండం వద్దనే విధిగా ఉంటూ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్త పడ్డారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ అశోక్ రెడ్డి, బ్రహ్మోత్సవాల ప్రత్యేక అధికారి కృష్ణ, ఆలయ కార్యనిర్వాన అధికారి నవీన్ కుమార్, ఇంద్రసేనారెడ్డి శ్రీనివాసరెడ్డి శేఖర్ రెడ్డి వంశీ నరేష్ స్థానిక నేతలు గడుసు శశిధర్ రెడ్డి వారాల రమేష్, డీఎస్పీ శివరామిరెడ్డి సిఐ కె నాగరాజు ఎస్సై కాంత్ కుమార్, శివ సత్తి క్రాంతి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి నామినేషన్ దాఖలు చేసిన అలుగుబెల్లి నర్సిరెడ్డి



మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



నవతెలంగాణ-అర్వపల్లి

మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిని అంజయ్య ఇటీవల మృతి చెందారు. శుక్రవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు మృతుని కుటుంబాన్ని పరామర్శించి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబీకులకు ఐదువేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. వారివెంట కాంగ్రెస్ నాయకులు గుడిపల్లి మధుకర్ రెడ్డి, బైరబోయిన మహారాజు, యాగానందం మనోహర్, మాధవ్‌లు ఉన్నారు.

అంజయ్య యాదవ్ లేనిలోటు తీరనిది

తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్ పటేల్ రమేష్ రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

జిల్లా కాంగ్రెస్ నాయకులు ఉండ్రుగొండ శ్రీ లక్ష్మీనర్సింహ్మా స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ డాక్టర్ ఊర రామ్మూర్తి యాదవ్ తండ్రిగారైన అంజయ్య యాదవ్ లేని లోటు తీరనిదని తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్,టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జె ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన అంజయ్య యాదవ్ దశదినకర్మ కార్యక్రమంలో ఆయన పాల్గొని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముదిరెడ్డి రమణరెడ్డి, గట్టు శ్రీను, కౌన్సిలర్లు షఫీ ఉల్లా, వెలుగు వెంకన్న, పెద్దగట్టు మాజీ చైర్మెన్ మద్ది శ్రీనివాస్ యాదవ్, ఫారూఖ్, పిల్లల రమేష్ నాయుడు, దేవేందర్, తండు శ్రీను, నిమ్మల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కోటాచలం



నవతెలంగాణ-అర్వపల్లి

ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పర్సాయిపల్లిలో నిర్వహించిన జాతీయ క్షయ నిర్మూలన శిబిరాన్ని జిల్లా ఆయన సందర్శించి మాట్లాడారు. 'ప్రతి ఒక్కరిపై దృష్టి క్షయ రహిత తెలంగాణకై కృషి' అనే నినాదంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. టీబీ లక్షణాలు ఎడతెరపి లేని దగ్గు, జ్వరం, ఆయాసం, ఆకలి మందగించటం, బరువు కోల్పోవడం, ఛాతీలో మంట వీటిలో ఒకటి, రెండు లక్షణాలు ఉన్నట్టయితే టీబీ కేసులుగా అనుమానించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని, ఒక వేళ నిర్ధారణ అయితే మందులు వాడి పూర్తిగా నిర్మిలించవచ్చునని తెలిపారు. నిర్లక్ష్యం చేస్తే సంవత్సరంలో 15 నుండి 20 మందికి టీబీ వ్యాధి అంటుకునే అవకాశం ఉన్నందున, ఈ వ్యాధి ఎక్కువగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి, 60 సంవత్సరాల పైబడిన వారు, స్ట్రీట్ వెండర్స్, గతంలో టీబీ మందులు వాడిన వారు, ఫ్యాక్టరీలో పనిచేవారిని గుర్తించి పరీక్షలు నిర్వహించాలని ఆరోగ్య సిబ్బందినీ సూచించారు. ఈ వంద రోజుల నిక్షయ శివర్ కార్యక్రమం భాగంగా జరుగుతుందని ప్రారంభ దశలో గుర్తించి ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు ఆరు నెలలు పాటు మందులు వాడితే టీబీ జబ్బు పూర్తిగా నయం అవుతుంది ఇతరులకు వ్యాప్తి చెందాదాని కావున సకాలంలో ప్రతి ఒక్కరు పరీక్షలు నిర్వహించుకోవాలని ప్రజలను కోరారు. 70 మందికి ఎక్స్‌రే, తెమడ పరీక్షలు, సీవై-టీబీ ఇంజక్షన్ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలోతు బిచ్చునాయక్, హెహెచ్ ఈ విమలమ్మ, అరుణ కుమారి, సూపర్ వైజర్ రామచంద్ర, మహల్ప్ సరస్వతి, దర్బబ్ కో ఆర్డినేటర్ ప్రసాద్, ఎస్‌టీఎస్ కిరణ్ కుమార్, మాధవ రెడ్డి, యాదగిరి, ప్రవీణ రెడ్డి, పార్వతి, సుమ, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మండల అభివృద్ధికి ఐక్యంగా పోరాడాలి

- ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య

నవతెలంగాణ-నూతనకల్

మండల సమగ్ర అభివృద్ధి కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా ఐక్యంగా పోరాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో మండల సమస్యలపై ప్రచురించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, గురుకుల, మోడల్, పాఠశాలలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మండలం పరిధిలో జన్నారెడ్డి ప్రతాపరెడ్డి వారసుల భూములకు సుమారు 1,680 ఎకరాల భూములను పేద ప్రజలకు పట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సారెస్పీ కాలువలను మెరుగుపరిచి మండల చివరి ఆయకట్టు వరకు నీరందించాలన్నారు. మండల కేంద్రంలో డ్రైనేజీ కాలువలు, స్ట్రీట్ లైట్లు వేయాలని, గ్రంథాలయం కు సొంత బిల్డింగ్ నిర్మించాలని అదేవిధంగా నిత్యం రద్దీగా ఉండే రోడ్డుపైన బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని, అన్నారు. మండల రైతాంగ చిరకాల కోరిక మినీ మార్కెట్ యార్డును ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు సుంకిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మండల నాయకులు దగ్గుల మల్లయ్య, గడ్డం శీను, బోలగాని ఉప్పలయ్య, ఉప్పల మణికుమార్, పులుసు క్రాంతి కుమార్, చీమల నరేష్, మున్న మధు, ముప్పాని మధు, పంతం రామచంద్రు, మహేష్, కూసు పరమేష్, ప్రశాంత్, ఎల్లేష్, మల్లేష్ పాల్గొన్నారు.

సర్వాయి పాపన్నగౌడ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

నవతెలంగాణ-నూతనకల్



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ పోరాట చరిత్రను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్, పాపన్న విగ్రహ దాత తీగల గిరిధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ తీగల కరుణశ్రీలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో తానే దాతగ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. బహుజన గౌడ కులంలో పుట్టి స్వాతంత్రానికి పూర్వమే మొగలు చక్రవర్తులకు వ్యతిరేకంగా బడుగు బలహీన వర్గ ప్రజల అభివృద్ధి కోసం స్వయంగా ఒక సైనిక వ్యవస్థ ఏర్పాటు చేసుకొని సామ్రాజ్యాన్ని స్థాపించిన వీర యోధుడని అన్నారు. పాపన్న పోరాటాన్ని పోషణ యువత ఆదర్శంగా తీసుకొని సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేయాలని అన్నారు. అనంతరం గౌడ కులస్తులు జరుపుకుంటున్న కంఠమహేశ్వర కళ్యాణ మహోత్సవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు పశువుల అశోక్ యాదవ్ మండల కాంగ్రెస్ నాయకులు మూడ్ మోహన్ నాయక్, గౌడ సంఘ గ్రామ అధ్యక్షుడు బూడిద మల్లయ్య పెద్ద గౌడ్ బండపెల్లి శ్రీను గౌడ సంఘం నాయకులు, బండపల్లి సాగర్ ,యాదగిరి వెంకటయ్య, దశరథ లింగయ్య, మరగాని రమేష్, వెంకటాచలం, మొగ్గుల వెంకన్నరవి, వెంకటనారాయణ వీరయ్య, పూజల సైదులు, సమ్మెట మల్లేష్, వెంకటేష్, బతిని మురళి, నారాయణ, లింగయ్య పాల్గొన్నారు.

నూలి పురుగుల నివారణపై శిక్షణ

నవతెలంగాణ-నేరేడుచర్ల



ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణపై శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ పి నాగిని మాట్లాడుతూ ఈ నెల 10న నిర్వహించే జాతీయ నులి పురుగులు నివారణ కార్యక్రమం గురించి అవగాహన ఉండాలని ప్రభుత్వ మరియు ప్రయివేటు పాఠశాల ఉపాధ్యాయులకు, అంగన్వాడీ టీచర్లకు, శిక్షణా కార్యక్రమం నిర్వహించి నట్లు తెలిపారు. 1నుండి 19 సంత్సరాల పిల్లలలో ఎక్కువగా పరాన్న జీవి ద్వారా సంక్రమించే నులి పురుగులు, కొంకి పురుగులు, ఏలిక పాములు ప్రేగుల లో చేరి పిల్లలలో రక్త హీనత, పోషకాల లోపం, ఆకలి లేకపోవడం, కడుపు నొప్పి,వికారం, బలహీనత, బరువు తగ్గడం వంటి లక్షణాలుంటాయని, నులి పురుగులు సంక్రమించకుండా భోజనానికి ముందు, టాయిలెట్ ఉపయోగించిన తరువాత ప్రతిసారి చేతులు శుభ్రముగా కడుగుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సల్వది. శ్రీనివాస్ సీహెచ్ఓ కే.ధనమ్మ సూపర్ వైజర్ జీఎం నర్సయ్య, హెల్త్ అసిస్టెంట్ ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-అర్వపల్లి

బైక్‌పై వస్తూవుండగా కోతులు అడ్డు రావడంతో వాటిని తప్పించబోయి ఓ వ్యక్తికి గాయలైన ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లి గ్రామ శివారులోకి రాగానే బైక్ పైన ఉన్న వ్యక్తికి ఎదురుగా కోతులు రావడంతో వాటిని తప్పించుకొని పోయి కింద పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి స్థానికులు 108కు సమాచారం అందజేశారు. 108 సిబ్బంది ప్రదీప్ కుమార్, సతీష్ సూర్యాపేటలోని ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి నల్లగొండలో కోటక్ బ్యాంకులో పని చేస్తున్నట్టుగా సమాచారం.

ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువులో రాణించాలి

గైనకాలజిస్ట్ డాక్టర్ గంపల శిరీష

నవతెలంగాణ-హుజూర్‌నగర్



బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువులో రాణించాలని గైనకాలజిస్ట్ డాక్టర్ గంపల శిరీష సూచించారు. పట్టణ కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల అధ్యాపకుల ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాల ఆవరణలో యుక్త వయసు బాలికలు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యల పట్ల నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆమె మాట్లాడారు. విద్యార్థినులు అడిగిన పలు సందేహాలకు వారికి అర్థమయ్యే విధంగా వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ బాలికలు తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ చదువులో రాణించాలని అన్నారు. ప్రధానోపాధ్యాయురాలు జయప్రద మాట్లాడుతూ విద్యార్థులు తమకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను వాటి పరిష్కారాలను తెలుసుకోడానికి తమ ఉపాధ్యాయుల సహకారంతో ఉచిత అవగాహన సదస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన గైనకాలజిస్ట్ డాక్టర్ గంపల శిరీషకు కార్యక్రమ ఏర్పాటుకు సహకరించిన ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శైలజ, ఆర్ విజయ, షబానా, మాధవి, కరుణ, అపర్ణ జీవన, రామనరసమ్మ కమలమ్మ విజయలక్ష్మి, జానీ బేగం, వనజ, పీడీ జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్



రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి అని విన్నపం పోరాటం సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు. చీకూరి లీలావతి అన్నారు. ఇటీవల ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన కుల గణనలో బీసీలు 56 శాతంపైగా గతంలో మాట ఇచ్చిన ప్రకారం 42శాతం రిజర్వేషన్ ఇచ్చి ఎన్నికలు జరపాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కులగణన సర్వేలో పారదర్శకత లేదని, బీసీ జనాభాను దాదాపు 40లక్షలు జనాభాను తక్కువ చేసి చూపించారన్నారు. బీసీ విద్యార్థులకు అన్యాయం జరిగే సర్వే రిపోర్ట్ ను తక్షణమే పక్కన పెట్టాలని డిమాండ్ చేస్తున్నాము. అదే విధంగా బీసీ లు 52 శాతం నుండి 46 శాతం తగ్గినట్టుగా చూపటం దారుణమని, తక్షణమే వాస్తవాలతో కూడిన సర్వేను చేసి రాహుల్ గాంధీ మాట ప్రకారం బీసీ కులాలకు న్యాయము చేయాలి. బీసీ నాయకురాలు విన్నపం ఒక పోరాటం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షురాలు చీకూరి లీలావతి గౌడ్ పత్రికా ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు.

విజయ గణపతి ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-కోదాడటౌన్

కోదాడ పట్టణంలోని విజయ గణపతి దేవాలయం 20వ వార్షికోత్సవం ఆలయ అభివృద్ధి కమిటీ వారి ఆధ్వర్యంలో శుక్రవారం భక్తజన సమూహంలో కనుల పండువగ నిర్వహించారు. ఆలయ వేద పండితులు ఉదయం తెల్లవారు జామునండి స్వామివారికి పంచామృత అభిషేకాలు జరిపి తిరొక్క పూలతో అలంకరించారు. అనంతరం భారీగా తరలివచ్చిన భక్తులకు అన్నదానాన్ని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి కృష్ణయ్య, చలపతి శివ, ఓరుగంటి బ్రహ్మం, చలపాటి రామారావు, వంగవీటి లక్ష్మణ్ రావు, గోపారపు ఉపేందర్, మేకల నరేష్, తుంగతుర్తి శేషగిరిరావు, ఓరుగంటి నవీన్, నిఖిల్ పాల్గొన్నారు.

కులగణను ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించింది

- జగదీష్ రెడ్డి చేస్తున్న విమర్శలు అర్థరహితం
- రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

కులగణను, ఆర్థిక సామాజిక సర్వేను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా నిర్వహించిందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మెన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం బీసీల కులగణన, ఆర్థిక సర్వేను చేపట్టి, సంక్షేమ ఫలాలు అట్టడుగు వర్గాల ప్రజలకు అందించే విధంగా పనిచేస్తుందని అన్నారు. అదేవిధంగా వారి ఆర్థిక స్థితిగతులను సర్వే చేయడం ద్వారా వారికి రాజ్యాంగ ఫలాలు అందడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నాలుగు పథకాలను ప్రారంభించిందని ఆయన అన్నారు. ఎకరం పొలం వున్న రైతులకు రైతు భరోసా డబ్బులు వారి బ్యాంకు ఖాతాలలో జమఅయినాయని పేర్కొన్నారు. ఏడు లక్షల కోట్ల రూపాయల అప్పులు చేసిన కెసిఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని కోలుకోలేని విధంగా నాశనం చేశారని విమర్శించారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో 55 వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చారని చెప్పారు. మాజి మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన ఖండించారు. వారి పాలనలో కెసిఆర్ ఫాం హౌస్ కే పరిమితం అయినారని, ఏనాడు సచివాలయానికి వచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. దేశంలో సంస్కరణలు తీసుకుని వచ్చింది ఇందిరాగాంధీ అని, శాస్త్ర సాంకేతిక రంగాలలో అభివృద్ధి చేసింది కాంగ్రెస్ ప్రభుత్వంలోనే అని ఆయన తెలిపారు. జగదీష్ రెడ్డి విమర్శలు అర్థరహితం అన్నారు.

విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి



- రేస్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ చైర్మెన్ బాణాల వసంత వెంకటరెడ్డి

నవతెలంగాణ-కోదాడటౌన్

విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధించి జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని రేస్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ చైర్మన్ బాణాల వసంత వెంకటరెడ్డి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కోదాడ నియోజకవర్గస్థాయి పదవ తరగతి విద్యార్థుల టాలెంట్ టెస్ట్‌కు సంబంధించిన విజేతలకు నేడు కోదాడ పట్టణంలోని రేస్ ఐఐటి అండ్ మెడికల్ అకాడమీలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగడం ద్వారా సమాజానికి ఉపయోగపడాలని ప్రజల్లో ఉన్నటువంటి మూఢనమ్మకాలపై వారిని చైతన్యవంతం చేయాలని అన్నారు విద్యార్థులకు భవిష్యత్తులో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ పైన ఆసక్తి కలిగేలా ఇట్టి టాలెంట్ నిర్వహించిన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ సంఘాల నాయకులను వారు అభినందించారు. అనంతరం నిర్వాహకులు ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తమ్మనబోయిన నరేష్ మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించిన పదవ తరగతి విద్యార్థుల టాలెంట్ కార్యక్రమంలో 494 మంది విద్యార్థులు పాల్గొన్నారు వారిలో మొదటి బహుమతి సిహెచ్ యామిని (శ్రీ వైష్ణవి కాన్సెప్ట్ స్కూల్) ద్వితీయ బహుమతి రాహుల్ చౌదరి (తేజ టాలెంట్ స్కూల్) తృతీయ బహుమతి వి హర్షవర్ధిని (జయ హైస్కూల్) 4వ బహుమతి బి సందీప్ రెడ్డి (గ్లోబస్ ఇంటర్నేషనల్ స్కూల్), 5వ బహుమతి ఎం గౌతమ్ చరణ్ (సైదయ్య కాన్సెప్ట్ స్కూల్) లకు బహుమతులు అందజేసి వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో బహుమతుల దాతలు పిండ్రాతి హనుమంతరావు, సిరాపరపు శ్రీనివాసరావు, అంబాల వెంకటి త్రివేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సిరికొండ శ్రీనివాస్, పదిరె మహేష్, మండవ మధు, రమేష్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ రైతువ్యతిరేక విధానాలపై నిరసన



నవతెలంగాణ-గరిడేపల్లి

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. మిర్యాలగూడ కోదాడ ప్రధాన రహదారిపై సీపీఐ(ఎం) నాయకులు రాస్తా రోకో చేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి ఎస్.కె యాకూబ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు రైతులు, కార్మికులు, నిరుద్యోగులకు వ్యతిరేకంగా ఉందని ఆయన ఆరోపించారు. ఈ బిల్లును వ్యతిరేకిస్తూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతు రాజ్యమని చెబుతూ ప్రవేశపెట్టిన బిల్లు ద్వారా రైతాంగానికి ఒరిగిందేమీ లేదని అన్నారు. వ్యవసాయానికి సబ్సిడీలు మొత్తం ఎత్తివేసి రైతు రాజ్యం అని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కార్పోరేట్ల కు కొమ్ముకాస్తూ నూటికి 75 శాతం ఉన్న రైతులను కార్మికులకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఆయన విమర్శించారు. కేవలం 20 శాతం ఉన్న పెట్టుబడిదారుల చేతుల్లోకి మొత్తం సంపద వెళుతుందని ఆయన ఆరోపించారు. మొత్తం దేశాన్ని ప్రైవేట్ పరం చేస్తూ రైల్వేలు, విమానాశ్రయాలు, బొగ్గు, గనులు చివరికి దేశానికి ఆదాయం అందిస్తున్న ఎల్ఐసి ని కూడా ప్రైవేట్ వ్యక్తుల్లో పెట్టి ఈ దేశాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. అంతేకాక కేంద్ర ప్రభుత్వం కులం మతాల మధ్య చిచ్చు పెడుతూ దేశ సమగ్రతను నష్టపరస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మల సైదయ్య దోసపాటి భిక్షం, యమ గాని వెంకటేశ్వర్లు, అంబటి భిక్షం, మాజీ ఎంపీటీసీ సుశీల, సారెడ్డి సైదిరెడ్డి, మండవ సైదులు, రాయిరాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ప్రతి కార్యకర్తనూ కాపాడుకుంటా

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

నవతెలంగాణ-కోదాడటౌన్

కోదాడ మండల పరిధిలోని తొగర్రాయి బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు అమరబోయిన శ్రీనివాస్ యాదవ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ వెన్నెముక ఆపరేషన్ చేపించుకున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ బొల్లం మల్లయ్య యాదవ్ వారి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతికార్యకర్తకూ అండగా ఉంటానని అధైర్యపడొద్దని ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని మనోధైర్యాన్ని కల్పించి వారి కుటుంబానికి బాసటగా ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చింతా కవిత రాదారెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి శెట్టి సురేష్ నాయుడు, మాజీ సర్పంచులు దొంగల లక్ష్మీనారాయణ, పొట్లా విజయ కిరణ్, మాజీ సొసైటీ చైర్మెన్ ముత్తవరపు రమేష్, మాజీ మండల కోఆప్షన్ సభ్యులు షేక్ ఉద్దండు, పట్టణయూత్ అధ్యక్షులు ఇమ్రాన్ ఖాన్, పట్టణ నాయకులు ఉపేందర్, కిరణ్ చౌదరి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్ గెలుపు తథ్యం

నవతెలంగాణ-గరిడేపల్లి

ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పూల రవీందర్ గెలుపు తథ్యమని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షులు ఎం. పర్వతరెడ్డి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులను శుక్రవారం ఆయన ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి, ప్రభుత్వ విద్యారంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు చట్టసభల్లో బలమైన గొంతుకను వినిపించేందుకు పూల రవీందర్‌ను అత్యధికం మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఎస్ టి యు జట్టు ఉపాధ్యాయ అధ్యాపక సంఘాలు ఉమ్మడిగా పూల రవీందర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నిర్ణయించాయని విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు, డి ఏ బకాయిలు, పి.ఆర్.సి సాధన మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాలల సమస్యలపై ఉద్యమిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.



విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- ఎంఈఓ బోయిని లింగయ్య



నవతెలంగాణ-తుంగతుర్తి

ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర కీలకమైందని, తుంగతుర్తి మండల విద్యాశాఖ అధికారి బోయిని లింగయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ విద్యాభారతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వపరిపాలన దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల వైఖరి, ప్రవర్తన, ఆదర్శాలు సమాజానికి మార్గనిర్దేశనం చేస్తాయన్నారు. అంతకుముందు విద్యార్థులు వివిధ రాజకీయ నాయకుల, అధికారుల వేషధారణలతో మెయిన్ రోడ్డుపై కార్లతో కాన్వాయ్ నిర్వహించి అంబేద్కర్, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ గా అర్షత్ పాషా, కరస్పాండెంట్‌గా శ్రీనివాస్, రాష్ట్రపతిగా గోపగాని పృథ్వీరాజ్, ఉపరాష్ట్రపతిగా గోరోజు తేజస్విని, ప్రధానమంత్రిగా కడారి ఐశ్వర్య, హెూం మంత్రిగా ఆలకుంట్ల విజయ శ్రీ, ఆర్థికశాఖ మంత్రిగా లకావత్ చందన, ఆరోగ్యశాఖ మంత్రిగా షేక్ నస్రీన్, విద్యాశాఖ మంత్రిగా గుగులోత్ ప్రవీణ్, గవర్నర్గా తస్నీరు పద్మజ, ఉప ముఖ్యమంత్రిగా అంబటి అశ్విని, గ్రామీణ శిశు సంక్షేమ మంత్రిగా పూసపల్లి మేఘన, ఎంపీగా లకావత్ అలేఖ్య, ఎమ్మెల్యేగా ఉప్పుల సాయిశ్రీ, కలెక్టర్గా రింగ్ నాగేంద్ర కుమార్, డీఈవోగా గడ్డం శ్వేత శ్రీ, ఎంఈఓ గా మహమ్మద్ హుదాహేళం, డాక్టర్‌గా చేపూరి సిరి, కట్ల స్పందన తోపాటు పాఠశాల ప్రిన్సిపాల్ పి మల్లయ్య, డైరెక్టర్స్ ఎండి నజీర్, కోట వెంకటగోపాల్, ఉపాధ్యాయులు లింగమూర్తి, సరిత, సురేష్, ఈరోజి, మున్ని, స్వప్న, ఉమ, సునిత, రాధ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలి

- తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్

నవతెలంగాణ-తుంగతుర్తి

ప్రతి ఒక్కరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం తుంగతుర్తి మండల పరిధిలోని కర్విరాల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం, విగ్రహ ప్రతిష్ట మహోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ కమిటీ మాజీ ఎమ్మెల్యేకు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. అనంతరం స్థానిక నాయకులు గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. దైవ చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. ప్రజలలో భక్తి భావాలు పెంపొందడం వల్ల సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొంటుదని పేర్కొన్నారు. నిత్యం భగవంతుడిని స్మరించుకుంటే ప్రతి ఒక్కరి జీవనం సుఖసంతోషాలతో వర్ధిల్లుతుందన్నారు.రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ మట్టపల్లి శ్రీశైలం యాదవ్, గోపాల్ రెడ్డి, తడకమల్ల రవికుమార్, గోపగాని శ్రీనివాస్ గౌడ్, ఉప్పుల నాగమల్లు యాదవ్, వాస్తు వెంకన్న, వెలుగు వెంకన్న భాస్కర్, సైదులు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పరీక్ష కేంద్రాల్లో తనిఖీ



నవతెలంగాణ-తిరుమలగిరి

మండల కేంద్రంలోని ఉషశ్రీ ఒకేషనల్ కళాశాలలో జరుగుతున్న బ్రిడ్జ్ కోర్స్ ప్రాక్టికల్ పరీక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ వీఓఎస్ ప్రసాద్ మరియు వేముల బాలరాజు ఆకస్మిక తనిఖీ చేశారు. కళాశాలలోని ప్రాక్టికల్స్ ల్యాబ్ గదులను తిరిగి పరీక్షలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో చీఫ్ సూపరిండెంట్ ఉషశ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పాలబిందెల శ్రీనివాస్, పరీక్ష అధికారులు టి. ప్రవీణ్ కుమార్, వి. ప్రదీప్ అధ్యాపకులు రాజు, వేమన తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
శుక్రవారం | ఫిబ్రవరి 08, 2025 | www.navatelangana.com

పాతగుట్ట బ్రహ్మోత్సవాలు ప్రారంభం

నవతెలంగాణ-యాదగిరిగుట్ట

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి అనుబంధం దేవాలయం పాతగుట్ట బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుండి ప్రారంభ మయ్యాయి. బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు స్వస్తివచనం, విశ్వక్సే నారాధన పుణ్యావనం రక్షాబంధన్ కార్యక్రమాలు పంచరాత్ర ఆగమశాస్త్ర ప్రకారం నిర్వహించారు. ఈ వేడుకల్లో అనువంశిక ధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు అధికారులు పాల్గొన్నారు.



జాతీయస్థాయిలో సత్తా చాటిన ఐరిస్ విద్యార్థులు

నవతెలంగాణ-బొమ్మలరామారం



ఇటువల మధురైలో జరిగిన జాతీయ స్థాయిలో రోలర్ స్కేటింగ్ పోటీల్లో బొమ్మల రామారం మండలంలోని యావపూర్ ఐరిస్ విద్యార్థులు రోలర్ స్కేటింగ్ పోటీలో విద్యార్థులు సత్తా చాటి విజేతలుగా నిలిచారు.2 బంగారు పతకం,14 రజత 09 కాంస్య పతకాలను సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ రుద్ర లక్ష్మిడైరెక్టర్ సేత్ అభినందించారు.అనంతరం ప్రిన్సిపాల్ రుద్రలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న జనరేషన్ పిల్లలకు ఎంతో ఇష్టమైన రోలర్ స్కేటింగ్,ఒక వైపు చదువులో ఒకవైపు ఆటల్లో సత్తాచాటిన ఐరిస్ విద్యార్థులేని విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన ప్రముఖులు

నవతెలంగాణ-భువనగిరి

భువనగిరి ఆర్డీవో ఏటీజీఓ స్టేట్ కోశాధికారి మందడి ఉపేందర్‌రెడ్డి నిర్మల కుమార్తె శ్రీనిధి,వినీత్‌రెడ్డి ల వివాహం పెద్ద అంబర్పేట్ నిధి కన్వెన్షన్‌లో శుక్రవారంజరిగింది. ఈ వివాహానికి మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్,పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ మీడియా ప్రతినిధి బోరెడ్డి అయోధ్యరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు రామానుజలరెడ్డి, వేణుగోపాల్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.జిల్లాలోని వాణిజ్య, వ్యాపార, రెవెన్యూ రాష్ట్ర,జిల్లా స్థాయి నాయకులు పాల్గొన్నారు.

రాయగిరిలో శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి శివారులోని రాయగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 11వ తేదీ నుండి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మాజీ మున్సిపల్ వైస్‌చైర్మెన్ చింతల కిష్టయ్య తెలిపారు. కాగా శుక్రవారం వారు శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం కోనేరు వద్ద పూజా కార్యక్రమం నిర్వహించారు.లైటింగ్,ఇతర ఏర్పాట్లను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నాయిని అరుణపూర్ణచందర్, గ్రామ నాయకులు దాసరి శ్రీనివాస్, సుధగాని మహేందర్, పోచంపల్లి భరత్ పాల్గొన్నారు.

ప్రమోద్‌కుమార్‌ను పరామర్శించిన మంత్రి, ప్రభుత్వవిప్

నవతెలంగాణ-భువనగిరి



అనారోగ్యంతో ప్రమోద్‌కుమార్ సతీమణి రోజా మృతి చెందడం కుటుంబానికి తీరని లోటని వారి అకాల మరణం పట్ల తీవ్ర సంతాపం వెలిబుస్తున్నామని, వారి కుటుంబానికి కాంగ్రెస్‌కుటుంబం అండగా ఉంటుందని రాష్ట్ర రోడ్లు భవనాలు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి పోత్నక్ ప్రమోద్‌ను పరామర్శించరాఉ. భువనగిరి పర్యటనకు విచ్చేసి ఇటీవల సతీవియోగం పొందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్ ఇంటికి విచ్చేసి రోజా చిత్రపటానికి నివాళు లర్పించారు.కుటుంబసభ్యులను పరామర్శించారు. అన్నివేళలా కుటుంబానికి కష్టనష్టాలు తోడుంటానని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ ఎండి అవేస్ చిస్టీ, మాజీ మున్సిపల్ చైర్మెన్లు బర్రె జహంగీర్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ విభాగం అధ్యక్షులు దర్గాయి హరిప్రసాద్, డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎండి మజర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, వివిధ సంఘాల నాయకులు బట్టు రామచంద్రయ్య పాల్గొన్నారు.

సాగునీరు సాధించడమే ఏకైక లక్ష్యం

నవతెలంగాణ-చౌటుప్పల్ రూరల్

సాగునీరు సాధించడమే ఏకైక లక్ష్యంగా ఆందోల్ మైసమ్మ జలసాధన సమితి పనిచేస్తుందని వరకంతం పెంటా రెడ్డి అన్నారు.శుక్రవారం పీపల్ పహాడ్ గ్రామంలో ఆందోల్ మైసమ్మ జలసాధన సమితి కరపత్రాలను మాజీ ఎంపీటీసీ వరకంతం పెంటారెడ్డి అధ్యక్షతన ఆవిష్కరించారు. గ్రామంలో సాగినీరు సాధించడమే ఏకైక లక్ష్యంగా పనిచేస్తామని ముక్తకంఠంతో రైతులు ప్రతిజ్ఞ చేశారు.చౌటుప్పల్ ఎగువ బాగాన అనేక గ్రామాలకు సాగునీరు లేక ఎడారిగా మారే పరిస్థితి నెలకొందని పీపల్ పహాడ్ మాజీ ఎంపీటీసీ పెంటా రెడ్డి అన్నారు.గీత కార్మికులకు వర్షాలు లేక కళ్ళు కూడా దిగే పరిస్థితి లేదని గీత కార్మికులు వాపోయారు.ఈ కార్యక్రమంలో పీపల్‌పహాడ్ మాజీ సర్పంచ్ రాణిరంగారెడ్డి జలసాధన సమితి సభ్యులు బద్దంఅంజిరెడ్డి, బొమ్మిడినర్సిరెడ్డి, మునుకుంట్ల వెంకటేష్‌గౌడ్,ఎర్రగాలయ్య, నూనెసహదేవ్, రోషణగారి మల్లేశం, ఎర్ర బుచ్చయ్య తోటకూర మల్లేశం, కంచరకుంట్ల వెంకటరెడ్డి,బూడిద జగన్మోహన్‌రెడ్డి,మాజీ సర్పంచ్ గోపి,సుధాకర్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లాంల మణెమ్మ దశదిన కర్మలో మంత్రి, ప్రభుత్వవిప్

నవతెలంగాణ-మోటకొండూర్

కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఎల్లాంల సంజీవరెడ్డి మాతృమూర్తి ఎల్లాంల మణెమ్మ ఇటీవల మండలంలోని చామాపూర్ గ్రామంలో పరమపదించారు.శుక్రవారం రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కోమటిరెడ్డివెంకట్‌రెడ్డి,ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.పూలమాలలేసి నివాళు లర్పించారు.ఈ కార్యక్రమంలో ఆలేరు, మోత్కూరు మార్కెట్ కమిటీ చైర్మెన్లు ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, నూనెముంతల విమల వెంకటేశ్వర్లు, ఆలేరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ పచ్చిమట్ల మదార్‌గౌడ్ ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరి,పార్టీ మండల అధ్యక్షుడు గంగపురం మల్లేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ సిపిఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం,ఆలేరు కాంగ్రెస్ నాయకులు ఏజాజ్,మాజీ జెడ్పీటీసీ కొంతం మోహన్‌రెడ్డి, కొప్పుల సోమిరెడ్డి కోల్కొండ యాదగిరి,నాయకులు యాస లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మహిళాఅధ్యక్షురాలు బోయిని ఝాన్సీ, మండల ఉపాధ్యక్షులు భూమండ్ల అశోక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బుగ్గ శ్రీనివాస్,బీఆర్ఎస్ నాయకులు ఎగ్గిడి కృష్ణ,జివిలికపల్లి వెంకటేష్,యాదగిరిగుట్ట మండల అధ్యక్షులు కానుగు బాలరాజు, బీజేపీ నాయకులు దొంతిరి శ్రీధర్‌రెడ్డి, తండ కృష్ణతదితరులు పాల్గొన్నారు.



బస్ కండక్టర్ పుస్తెలతాడు అపహరణ

నవతెలంగాణ-ఆలేరుటౌన్

బస్ కండక్టర్ చైన్ పుస్తెలతాడు అపహరణ గురైన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనగామకు చెందిన ఉమామహేశ్వరి జనగాం డిపో బస్ కండక్టర్. జనగామ నుండి హైదరాబాదుకు డ్యూటీ నిమిత్తం విధులలో భాగంగా టీఎస్ 27 జెడ్ 0028 బస్సులో వెళ్తుండగా బస్సులో జనగామ నుండి ఆలేరుకు వస్తున్న క్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు కండక్టర్ మెడలో నుండి మూడు తులాల పుస్తెలతాడు అపహరించారు. బస్సు ఆలేరు బస్ స్టేషన్‌కు రాగా, అంతలోనే కొందరు మహిళ ప్రయాణికులు దిగిపోయారు. తేరుకున్న కండక్టర్ పుస్తెలతాడు పోయినట్లు గుర్తించిన మహిళా కండక్టర్ వెంటనే స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై రజినికర్‌కు ఫిర్యాదు చేశారు.

పీఆర్ఆర్ ఫౌండేషన్ కృషి అభినందనీయం

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

విద్య అభివృద్ధి పట్ల పీఆర్ఆర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని జనగాం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కత్తుల ఉదయ అన్నారు.శుక్రవారం జనగాం, సంస్థాన్ నారాయణపురం జిల్లా పరిషత్ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన లాస్ట్‌మినిట్ రివిజన్ పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఫౌండేషన్ వ్యవస్థాపన అధ్యక్షులు పాండు రంగారావును శాలువాతో సన్మానం చేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎస్సై జె.జగన్, నారాయణపురం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రమాదేవి, ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్‌సభ్యులు గండికోట రాజేష్,వెంకటేశ్వరరావు, భాస్కరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



త్యాగానికి ప్రతిరూపం రమాబాయి అంబేద్కర్

నవతెలంగాణ-రామన్నపేట

రమాబాయి అంబేద్కర్ త్యాగానికి ప్రతిరూపంగా నిలిచారని సామాజిక కార్యకర్త వేములసైదులు అన్నారు.శుక్రవారం మండలంలోని కక్కిరేణి గ్రామంలో రమాబాయి అంబేద్కర్ 128వ జయంతిని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.ఆమె నేటి యువతకు ఆదర్శమన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కన్నెబోయిన జగన్, యాదయ్య, ముప్పిడి దయాకర్, అంకిరెడ్డి యాదయ్య, నల్ల ప్రసాద్, కళ్లెం లక్ష్మణ్, కొంపెల్లి నరసింహ, నరేష్, గూడపూరి విష్ణు, బాసాని సత్తయ్య, కట్ట సుశీల, యశోద, భద్రమ్మ, కొన్నె రాజు, సైదులు, సోములు తదితరులు పాల్గొన్నారు.

10న మహాధర్నాను జయప్రదం చేయండి

- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో 2025-26 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేక బడ్జెటని ఈ బడ్జెట్ కు వ్యతిరేకంగా ఈ నెల 10న హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహాధర్నాలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండమడుగు నర్సింహ పిలుపునిచ్చారు. శుక్రవారం భువనగిరి మండలపరిధిలోని అనాజిపురం గ్రామంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద హైదరాబాదులో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రజాసంఘాల బాధ్యులతో కలిసి కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్ ప్రజల జీవితాలకు, శ్రామిక ప్రజల బతుకుదెరువుకు శాపంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇంత మొండిగా బరితెగించి ప్రజావ్యతిరేక విధానాలను అమలు జరుపుతున్న నేపథ్యంలో రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు, శ్రామికులు, ఇతర ప్రజానీకం ఐక్యంగా పోరాటాలు నిర్వహించటం తప్ప మరో మార్గం లేదన్నారు. సరళీకృత ఆర్థిక విధానాలను వేగంగా అమలు చేసేందుకు ఊతమిచ్చేలా బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థూల జాతీయోత్పత్తి అంచనాలు భిన్నంగా పడిపోయాయని చెప్పారు. దీనికి కారణం ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడమే నన్నారు. ఈ కాలంలో నిత్యజీవితావసరాల సరుకులను సాధారణ ప్రజలు పెద్దగా కొనుగోలు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పల్లెర్ల అంజయ్య, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు గునుగుంట్ల శ్రీనివాస్,ఐలా జిల్లా సహాయకార్యదర్శి డాక్టర్ బొల్లెపల్లి కుమార్, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అబ్దుల్లాపురం వెంకటేష్, తెలంగాణ రైతుసంఘం జిల్లా నాయకులు ఏదునూరి మల్లేశం, ఎస్ఎఫ్ఐ మాజీ డివిజన్ కార్యదర్శి ఏదునూరి వెంకటేష్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు మైలారం శివ, జీఎంపీఎస్ మండల నాయకులు కడారి కృష్ణ, వివిధ ప్రజాసంఘాల నాయకులు గంగనబోయిన బాలనర్సింహ, గంగనబోయిన పాండు, చేగూరి రాజు, ఎదునూరి సత్తయ్య, శ్రీరాం నర్సింహ, పన్నాల దయాకర్‌రెడ్డి, పన్నాల మోహన్‌రెడ్డి, ఆకులశంకరయ్య, గోగు బాలనరసింహ, గోగుఅయిలయ్య, కొక్కుల భిక్షపతి పాల్గొన్నారు.



అక్రమ వలసదారులపై అమెరికా అమానుషాన్ని ఖండిస్తున్నాం

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జహంగీర్

నవతెలంగాణ-భువనగిరి



అక్రమవలసదారులను ఏదేశ చట్టమైన అంగీకరించదు కానీ వలసదారులను తిరిగి ఆయాదేశాలకు పంపే విధానం తీవ్ర అభ్యంతకరంగా ఉన్నది.భారత వలస దారులను సరుకులు సరఫరా చేసే యుద్ధ విమానాల్లో కుక్కి తీసుకరావడం అమానుషమైదని, దీన్ని ఖండిస్తున్నామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి.జహంగీర్ అన్నారు.శుక్రవారం ఆ పార్టీ జిల్లా కార్యాలయం నుండి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికాలో వలసదారులుగా ఉన్న భారతీయులను కాళ్ళు చేతులకు సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీల్లగా పంపించడం ఘోరమని ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధంలో పట్టుబడిన ఖైదీలను కూడా గౌరవంగా చూడాలని నిబంధనలు ఉన్నాయి, కానీ అమెరికా అధ్యక్షులు ట్రంప్ యుద్ధ నేరస్తులుగా వలసవాసుల పట్ల వ్యవహరించడం ఖండిస్తున్నామని తెలిపారు.ప్రధాని మోడీ అనుసరించిన ఆర్థిక విధానాలు, నిరుద్యోగాన్ని పెంచి పోషించడం వల్ల గత్యంతరం లేక భారత మేధోసంపత్తి వలస వెళ్తుందన్నారు. దీనికి ప్రధానకారణం భారత నిరుద్యోగ రేటు రోజురోజుకు పెరగడమేనన్నారు. భారతీయ వలసదారులను గౌరవంగా తీసుకరావడం కోసం కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరారు.

కారుపోతుల వెంకన్న కుటుంబానికి మంత్రి చేయూత



- కుటుంబానికి అందజేసిన డీసీసీ ఉపాధ్యక్షులు సోమిరెడ్డి

నవతెలంగాణ-మోత్కూర్

మోత్కూర్ యూత్ కాంగ్రెస్ లీడర్ కుటుంబానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేయూతనిచ్చి అండగా నిలిచారు. యూత్ కాంగ్రెస్ యాదాద్రి జిల్లా మాజీ కార్యదర్శి కారుపోతుల వెంకన్నగౌడ్ తండ్రి యాకయ్య ఇటీవల మృతి చెందారు. మంత్రి వెంకట్‌రెడ్డి శుక్రవారం వెంకట్‌ను ఫోన్‌లో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని, తాను అన్ని విధాలా అండగా ఉంటానని, త్వరలో వచ్చి కలుస్తానన్నారు.డీసీసీ యాదాద్రి జిల్లా ఉపాధ్యక్షుడు పైళ్ల సోమిరెడ్డి మంత్రి వెంకట్ రెడ్డి పంపిన రూ.లక్ష ఆర్థిక సాయాన్ని వెంకట్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు సోమిరెడ్డితో పాటు కాంగ్రెస్ లీడర్లు యాకయ్య చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ ఎండి.సమీర్, లీడర్లు పైళ్ల నర్సిరెడ్డి, తండ సత్తయ్య, జినుకల కనకయ్య, కేమిడి సైదులు, మెంట నగేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మెంట సురేష్, బుషిపాక రమేష్, కొణతం నరేందర్‌రెడ్డి, ఎరసానిపల్లి సందీప్, గొలుసుల శ్రీశైలం, ఆలకుంట్ల శ్రీను, నిమ్మల రమేష్, బద్దిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్న విషయంలో నాకు మాట్లాడేంత టైం లేదు

- ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ-భువనగిరి



తీన్మార్ మల్లన్న విషయంలో తనకు మాట్లాడేంత టైమ్ లేదని.. మాట్లాడం వేస్ట్ అని ఆర్అండ్‌బీ శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు.శుక్రవారం ఆయన భువనగిరిలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. తీన్మార్ మల్లన్నకు టీపీసీసీ, ఏఐసీసీ, క్రమశిక్షణ చైర్మెన్ చిన్నారెడ్డి నోటీసులు ఇచ్చినట్లు పేపర్‌లో చూశానని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వేలో 56.6 శాతం బీసీలు ఉన్నట్లుగా తేల్చామని తెలిపారు. బడుగు, బలహీనవర్గాలను అన్ని రంగాల్లో పైన తీసుకొని రావడమే తమ లక్ష్యమన్ని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే కచ్చితంగా 42 శాతం పార్టీ పరంగా రిజర్వేషన్లు కల్పిస్తామని అన్నారు. వర్గీకరణ విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తి లేదని తెలిపారు.90 శాతం ఉన్న జనాభా కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. దొరలు, భూస్వాములు ఫామ్‌హౌస్‌లో ఉండేందుకు కాదని దుయ్యబట్టారు.ఫామ్‌హౌస్‌లో ఉంటూ కులగణనలో పాల్గొనకుండా ఉన్న వాళ్లకు మాట్లాడే హక్కు లేదని మండిపడ్డారు. బీఆర్ఎస్ లెక్క తాము హడావిడిగా సర్వే చేయలేదని.. తాము చేసిన సర్వే ప్రజల ముందు పెట్టామని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రె జహంగీర్ గ్రంథాలయ సంస్థల చైర్మెన్, నాయకులు పిట్టల బాలరాజ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

పేషెంట్లకు అందుబాటులో ఉండి నాణ్యమైన వైద్యం అందించాలి

- కలెక్టర్ హనుమంతరావు

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

ఆస్పత్రికి వచ్చే పేషెంట్లకు వైద్యాధికారులు, సిబ్బంది నాణ్యమైన వైద్యం అందించి ప్రజలకు అందుబాటులో ఉండాలని కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శుక్రవారం భూదాన్‌పోచంపల్లి మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్ ను పరిశీలించి టీఎస్ విలియమ్స్ ల్యాబ్ టెక్నీషియన్స్ (గ్రేడ్-2) విధులకు హాజరు కాకపోవడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ల్యాబ్ టెక్నీషియన్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.ఎంతమంది సిబ్బంది ఉన్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైద్య అధికారులు సమయపాలన పాటించాలని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు. మందుల కొరత లేకుండా చూడాలన్నారు. అత్యవసర విభాగం సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండాలని ఆదేశించారు.ఓపీ రిజిస్టర్‌ను తనిఖీ చేస్తూ జనవరి నెలలో 23 , ఈడీలు ఉండగా 07 డెలివరీలు మాత్రమే చేశారన్నారు. ఫిబ్రవరి లో 32 ఈడీడీలు ఉండగా వాటిలో 01 డెలివరీ మాత్రమే చేశారని, వాటి సంఖ్య పెంచాలన్నారు.కలెక్టర్ స్వయంగా ఓపీ రిజిస్టర్‌లో గల నమోదైన పేషెంట్‌కు ఫోన్ చేసి ప్రభుత్వాస్పత్రిలో వైద్యం మంచిగా అందిస్తున్నారని, సేవలను ఉపయోగించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందుచేత

నవతెలంగాణ-రామన్నపేట

మండలములోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన బత్తుల బక్క మల్లయ్యకు మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిరియల్‌రెడ్డి మల్లారెడ్డి చొరవతో మంజూరైన రూ.32వేల చెక్కును యువజన కాంగ్రెస్ నాయకులు బత్తుల నవీన్‌కుమార్ శుక్రవారం మల్లయ్య కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీని యర్ నాయకులు రాచకొండ అనంతచారి, బీమగాని కృష్ణయ్య, తునికేశి శ్రీనివాస్‌రెడ్డి, బత్తుల పెద్దోళ్ల మల్లేశం, మెండే కృష్ణ, దాసరి మల్లేశం, యూత్ నాయకులు దిండు శ్రవణ్‌కుమార్, దొంతరబోయిన గణేష్, కొమ్ముప్రశాంత్, తొర్పునూరి దేవేందర్ తదితరులు ఉన్నారు.



అదేవిధంగా మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన కంబాలపెల్లి శివమ్మకు మంజురైన రూ.20వేలు, నల్ల వీరస్వామికి రూ.20వేలు, సింగనబోయిన శంకరయ్యకు రూ.39వేల సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను లబ్దిదారులకు శుక్రవారం మాజీ ఎంపీపీ పూస బాలమణి బాలనర్సింహ అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెద్దగోనివెంకటేశం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మార్పీఎస్ నాయకులకు డప్పులు అందజేత

నవతెలంగాణ-రామన్నపేట

మండలంలోని పల్లివాడ గ్రామంలో బీఆర్ఎస్ మండల మాజీ ప్రధాన కార్యదర్శి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ కంభంపాటి శ్రీనివాస్ శుక్రవారం మందకృష్ణ మాదిగ లక్ష డప్పులు వెయ్యిలగొంతులు నినాదంతో త్వరలో హైదరాబాదులో నిర్వహించబోయే బహిరంగ సభకు మద్దతు తెలుపుతూ పది డప్పులను, పల్లివాడ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులకు బీఆర్ఎస్ ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి కళ్లెం స్వామి మూడు డప్పులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరులను ఆశీర్వదించిన ప్రముఖులు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ఆలేరు మండలం కొల్లూరు గ్రామానికి చెందిన కోటగిరి బాలయ్యగౌడ్ కుమారుని వివాహ వేడుకలు అంగరంగ వైభవంగా శుక్రవారం జరిగాయి. నూతన వధూవరులను బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు జనగాం వెంకటపాపిరెడ్డి, జనగాం రఘుపతిరెడ్డి అక్షింతలతో ఆశీర్వదించారు. వివాహమహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సత్యమన్నఐలి కృష్ణ,శ్రీధర్,మధు, రాజు, రగులు, సురేష్, అంజనేయులు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

నవతెలంగాణ-బొమ్మలరామారం



మండలంలోని తిమ్మాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూగల రఘునందన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా నూతన స్టేజి సుమారు రూ.3 లక్షల సొంత నిధులతో నిర్మించి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామంలోని నిరుపేదల ప్రజలకు బట్టలు పంపిణీ చేశారు. విద్యార్థులకు నోట్‌బుక్స్, ప్యాడ్స్, పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సామాజిక సేవ అవలంబించుకోవాలని వారి తండ్రి ప్రతాప్‌రెడ్డి చేసిన సేవలను చిన్నతనం నుండే చూస్తూ అవలంబించుకున్నానన్నారు.. తన 60వ జన్మదిన వేడుకలను తను చిన్నతనంలో చదువుకున్న పాఠశాలలో పిల్లలతో జరుపుకోవడం సంతోషకరంగా ఉందని ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఎంఈఓ రోజారాణి, గ్రామస్తులు నాశమైన వెంకటేష్, దండుయాదగిరి, తునికి మహేష్,కాశమైన కనకరాజు, శ్రీశైలం, పాశంప్రసాద్ పాల్గొన్నారు.

సాగునీటి కోసం సాగుతున్న ఉద్యమం

నవతెలంగాణ-రాజపేట

జేఏసీ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డు ఉద్యమం చేపట్టిన రాజపేట మండల రైతు జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఐలయ్యకు, జిల్లా మంత్రి వెంకట్‌రెడ్డికి, వ్యవసాయశాఖ మంత్రికి, ఇరిగేషన్ మంత్రికి, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలకు శుక్రవారం పోస్ట్‌కార్డులు పంపారు.ఈ కార్యక్రమంలో రైతు జేఏసీ మండలకన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, బీఆర్ఎస్ మంలడఅధ్యక్షులుసట్టు తిరుమలేష్, రైతు జేఏసీ మండలగౌరవ అధ్యక్షులు గుంటి మధుసూదన్‌రెడ్డి,పీఏసీఎస్ వైస్‌చైర్మెన్ కాకర్ల ఉపేందర్, చిగుళ్ల బీరయ్య, నాగపురి పుల్లయ్య, చింతలదాస్, గంధమల్ల సురేష్, కోయ రాజనర్సు, నీలం రాజయ్య, వద్ది భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సాగునీరు జలాలు అందించాలంటూ, కాల్వల ద్వారా గొలుసుకట్టు చెరువులను నింపాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం, ప్రభుత్వ విప్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు సాగునీటి ఉద్యమం ఆగదన్నారు.

ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ

చౌటుప్పల్‌రూరల్ : చౌటుప్పల్ మండలం పీపల్ పహాడ్ గ్రామానికి చెందిన బోదాసు హరిత ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగి రాత్రికి ఇంటికి రాకపోవడంతో కలత చెంది శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.మన్మథ కుమార్ తెలిపారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వివరాల ప్రకారం.. బోదాసు రాముకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు.భార్య బోదాసు హరిత గురువారం బోదాసు రాము పనికి వెళ్లగా, అతని కుమారులు స్కూల్‌కు వెళ్లారు. బోదాసు రాము తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చేసరికి అతని భార్య హరిత కనిపించలేదు.దీంతో ఆమె గురించి చుట్టుపక్కల ఇండ్లు, బంధువులు ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు.దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-వలిగొండ రూరల్

మండలంలోని టేకులసోమారంలో ఇటీవల రైలు ప్రమాదంలో మృతిచెందిన నారగోని సైదులు కుటుంబానికి అదే గ్రామానికి చెందిన పీఎస్ఆర్ ఫౌండేషన్ అధినేత పనుమటి నరేందర్‌రెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన రూ.10 వేల ఆర్థికసాయాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలు మృతుని కుటుంబానికి శుక్రవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో రాజమల్లు, చేగూరిగోపాల్, గోద లక్ష్మయ్య, నారగోని అశోక్ తదితరులు పాల్గొన్నారు.



గాయకురాలు మందులవిజయకు పరామర్శ

నవతెలంగాణ-ఆలేరుటౌన్

ప్రముఖ గాయకురాలు, మందుల విజయ ,ఇటీవల అనారోగ్యంతో చికిత్స పొంది, ఆలేరు పట్టణంలో ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుండగా శుక్రవారం ఆలేరు మాజీ ఎమ్మెల్యే కుడుదుల నగేష్ విజయను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి గౌస్, కాంగ్రెస్ నాయకులు పల్లె సంతోష్‌గౌడ్, మందుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సీపీఐ సీనియర్ నాయకుడి మృతి

నవతెలంగాణ-మోటకొండూర్

మండల కేంద్రంలోని వట్టూరు గ్రామ కౌన్సిల్ సభ్యులు సింగిరెడ్డి దామోదర్‌రెడ్డి మృతి లోటని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ అన్నారు.మృతదేహంపై మండల కార్యదర్శి గాదేగాని మాణిక్యం, మండలకౌన్సిల్ కార్యవర్గ సభ్యులు పూలమాలలేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గాదేగాని మాణిక్యం, ఆలేటి బాలరాజు, బొలగాని లక్ష్మీ నారాయణ, పల్లె వెంకన్న సుధగాని వెంకన్న,నల్ల రాములు, గువ్వ వెంకన్న పల్లె శ్రీను, కర్రె సిద్ధులు, జివిలికపల్లి పాండు, పల్లె పవన్, జి.గణేష్, కుటుంబసభ్యులు సింగిరెడ్డి నర్సిరెడ్డి అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే



నవతెలంగాణ-మర్రిగూడ

మండలంలోని కొట్టాల గ్రామానికి చెందిన సీపీఐ గ్రామ కార్యదర్శి కల్లెట్ల లింగయ్య కూతురు వివాహానికి గురువారం మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అంజాచారి, మండల కార్యవర్గ సభ్యులు బుర్ర శేఖర్,వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు జక్కుల అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు.. ఎండుతున్న వరిచేలు



● పశుగ్రాసంగా మారుతున్న వరిపంట

నవతెలంగాణ-సంస్థాన్‌నారాయణపురం

పాలకుల నిర్లక్ష్యం,వర్షాభావ,వాతావరణం పరిస్థితులు అన్నదాతను కుంగదీస్తున్నాయి. వేసవి ఆరంభంలోనే ఎండల తీవ్రత ఎక్కువైంది. మూడేండ్ల వరుస వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భజలాలు అడుగంటి పోతున్నాయి. నాటు వేసిన నెలలోపే వరి చేలు నిట్టనిలువనా ఎండిపోతున్నాయి.ఈ ప్రాంతానికి ఎట్లాంటి సాగు నీటివనరులు లేకపోవడంతోనే తాను ఆర్థిక నష్టాలకు లోనౌతున్నామని రైతులు వాపోతున్నారు. సాగునీటి వసతులు కల్పిస్తామని పాలకులు ఎన్నికల ముందు వాగ్దానాలు చేయడం గెలిచాక మర్చిపోవడం పరిపాటిగా మారిందని రైతులు ఆరోపిస్తున్నారు.పోషక లోపాల వల్ల ఎర్రబారిన వరి చేలు కోలుకోక ముందే భూగర్భ జలాలు సాగు రైతులపై స్వారీ చేస్తున్నాయి. తెగుళ్ల, అడుగంటిన భూగర్భజలాల వల్ల ఎండిపోయిన వరి పంట చేలు పశువులకు మేతగా మారిపోతున్నాయి.

మండలంలో 31 గ్రామపంచాయతీలో ఉండగా ఈ రబీ సీజన్‌లో సుమారుగా 4800 ఎకరాలు వరి సాగు చేసినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. వేసవిఆరంభంలోనే ఎండల తీవ్రత ఎక్కువ ఉండడంతో భూగర్భజలాలు అడగండి పోయి సుమారుగా 1500 ఎకరాల్లో వరిపంట ఎండి పోయినట్లు రైతులు వాపోతున్నారు.మూడేండ్లుగా మండలంలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం నమోదు అవ్వడంతో ఈ పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాటుదశలో అత్యధికంగా నీళ్ల పోసిన బోరుబావులు నెలలోపే ఓట్టి పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పశువులకు తాగే నీళ్ల దొరికే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు.ఇంటి దగ్గర నుంచి నీళ్ల బిందెల ద్వారా నెత్తి మోత మోయాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు.పొలంలో వరి పంట సాగు చేసేందుకు దున్నకం,వరి నారు, నాటు కూళ్ల,అడుగు మందులు వంటి వాటితో కలుపుకొని సుమారుగా రూ.40 వేల ఖర్చయినట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెగుళ్లబారిన పడ్డ వరిచేలు రక్షించుకునేందుకు గుళికలు, పిచికారీ మందులు అదనపు భారాన్ని మిగిల్చాయంటున్నారు. ఎండిపోయిన వరిచేలకు నష్టపరిహారం అందజేయాలని రైతులకు కోరుతున్నారు.



ప్రభుత్వమే ఆదుకోవాలి :అంతటి గాలయ్య రైతు

తనకు ఉన్న రెండెకరాల్లో వరినాటు వేసిన రూ.80 వేల ఖర్చు వచ్చింది.నాటుదశలో ఫుల్లుగా పోసిన బోరు బావి నెలలోపే పూర్తిగా ఎండిపోయింది.పశువులకు తాగేందుకు నీళ్ల దొరకడం లేదు.పోయిన ఖరీఫ్ సీజన్‌లో ఇదే పొలంలో 8 క్వింటాళ్ల వడ్లు పండించిన.ఈ ఏడు యాసంగిలో నాటేసిన వరి నీళ్ల లేక ఎండిపోయింది.ఎండిన వరి చేను పశువులను మేపుతున్న ఎండిపోయిన వారికి పెట్టుబడి ఖర్చులైనా ప్రభుత్వం చెల్లించాలి.తమ కుటుంబాలను ఆదుకోవాలి.



పశువులకు ఇంటి దగ్గర నుంచి నీళ్ల మోస్తున్న: రేవనపల్లి రాములు, కౌలు రైతు

తనకున్న ఎకరం పొలంతో పాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకుని వరి సాగుచేశా. ఎండల వల్ల బోరు వట్టిపోయింది. పశువుల తాగేందుకు నీళ్ల లేవు.ఇంటి దగ్గర నుంచి నెత్తి మోతన బిందెలతో నీళ్ల పశువులకు మోసి పోస్తున్నా. ఈ ఇబ్బంది పడే దానికంటే పశువులను అమ్మేయాలనుకుంటున్న. ప్రభుత్వమే తమను ఆదుకోవాలి.



తెగుళ్ల బారిన పడి ఎకరం ఎండింది:పపూరి సతీష్,రైతు

తను మూడు ఎకరాల్లో వరి నాటేసి నెల రోజులైంది. తెగుళ్ల బారిన పడిన వరి పంట కోలుకోలేదు. గుళికలు వేసిన,మందులు పిచికారీ చేసినా ఎకరం ఎండిపోయింది. మిగిలిన రెండు ఎకరాలు ఎండల తీవ్రత వల్ల భూగర్భ జలాల అడుగంటిపోతుండడంతో పంట చేతికి వచ్చేదాకా ఆశ లేదు. ఎండిపోతదో.. పండిపోతాదో తెలియని పరిస్థితి. ఈ ప్రాంతానికి సాగునీటి వసతి లేకపోవడమే రైతులకు శాపంగా మారింది. సాగునీటి వనరులు కల్పించేందుకు కృషి చేయాలి.

అండర్‌పాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతి

నవతెలంగాణ-భువనగిరి కలెక్టరేట్

భువనగిరి ప్రభుత్వం ఐటీఐ దగ్గర నేషనల్ హైవే రామకృష్ణాపురం పెంచికల్ పహాడ్‌తో పాటు ఇతర గ్రా మాలకు వెళ్లడానికి అండర్‌పాస్ రోడ్ నిర్మాణం చేయాలని శుక్రవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, నిర్మాణ సాధన కమిటీ కన్వీనర్ సిల్వర్ ఎల్లయ్య మాట్లాడారు.భువనగిరి ప్రభుత్వ ఐటీఐ దగ్గర రామకృష్ణాపురం పెంచికల్ పహాడ్ నుండి వేములకొండ వరకు భువనగిరి, వలిగొండ, ఆత్మకూరు, మోటకొండూరు నాలుగు మండలాలకు సంబంధించిన 40 గ్రామాల ప్రజలు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రమైన తరువాత ఇతర ప్రాంతాల నుండి విద్య వైద్యం, ఉపాధి వ్యాపారాలు వివిధ వృత్తులకు సంబంధించిన వారు రైతులు రోజువారి అవసరాల కోసం పలువురు నేషనల్ హైవేను దాటి ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారన్నారు.హైవే దాటడానికి సరైన రోడ్డు మార్గం లేక ప్రమాదాలకు గురై వందలాదిమంది ఇప్పటికే ప్రాణాలు పోగొట్టుకొని కాళ్ల చేతులు విరిగి వికలాంగులుగా మారి ఆర్థికంగా చిక్కిపోయి ఆయా కుటుంబాలు రోడ్డున పడ్డ పరిస్థితి ఉందన్నారు.ఈ ప్రాంతవాసులు బుగ్గ కిష్టయ్య, చీమలకొండూరు దయ్యాల బాలరాజు, కేర్చిపల్లి జీ సత్తిరెడ్డి పోచంపల్లి వారు మృతి చెందారన్నారు..వీరితోపాటు వివిధ ప్రాంతాల వారు మరో 14 మంది మరణించారు. సుమారు 80 మంది అంగవైకల్యంతో వికలాంగులుగా మారారన్నారు. పలుమార్లు ప్రజలు వివిధ పార్టీలకు సంబంధించిన నాయకులు ఆందోళనలు పోరాటాలు నిరసన దీక్షలు ధర్నాలు చేపట్టి అధికారుల ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు.నేటికి సమస్య పరిష్కారం గాక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో వివేక్ ప్రతిభ

నవతెలంగాణ-చింతలపాలెం



జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో దొండపాడు వాసి గండెల వివేక్‌కి 4వ బహుమతి వచ్చిందని గండెల రాజా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదురై (చెన్నై)లో జరిగిన ఎస్ఎస్ఎఫ్ఐ (స్పీడ్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో దొండపాడు గ్రామం చింతలపాలెం మండలంకి చెందిన గండెల రాజా, రాజేశ్వరి దంపతుల పెద్ద కుమారుడు గండెల వివేక్ రాష్ట్రంలో రెండవ స్థానం, జాతీయ స్థాయి పోటీల్లో మదురై (చెన్నై)లో జరిగిన నాలుగవ స్థానంలో గెలుపొందాడని, మొత్తం అన్ని రాష్ట్రాలు వారిగా పోటీ పడగా మొదటిదీ తమిళనాడు, రెండు కర్ణాటక, మూడు ఆంధ్రప్రదేశ్, నాలుగు తెలంగాణ రాష్ట్రం 4వ స్థానంలో నిలిచాయని అన్నారు.

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్దిదారులకు వెంటనే స్వాధీన పరచాలి:సీపీఐ(ఎం)

నవతెలంగాణ-క్లాక్‌టవర్



లాటరీ ద్వారా ఎంపికైన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్దిదారులకు మౌలిక సదుపాయాలు కల్పించి వెంటనే స్వాధీనపరచాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, జిల్లా కమిటీ సభ్యులు యండి.సలీమ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం దొడ్డి కోమరయ్య భవన్‌లో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన పోరాట కమిటీ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017లో నిర్మాణం చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మౌలిక సదుపాయాలు కల్పించకుండా శిథిలావస్థకు చేరాయన్నారు. గత టీఆర్ఎస్ ప్రభుత్వం ఇండ్ల లేని పేదల ద్వారా దరఖాస్తులు స్వీకరించి పరిశీలించి అర్హుల జాబితా రూపొందించి అందులో నుండి వీడియో కెమెరాలలో లాటరీ ద్వారా లబ్దిదారులను ఎంపిక చేయడం జరిగిందని అన్నారు. వారికి వెంటనే స్వాధీన పరచకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. కిరాయి ఇండ్లలో నివాసం ఉంటూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వీరికి ప్రభుత్వం వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించి స్వాధీన పరచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఉన్న పేదవారికి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇస్తామని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూనే గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు శిథిలావస్థకు చేరకుండా పేదలకు స్వాధీనపరిచి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడవలసిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం పై ఉందన్నారు. మౌలిక సదుపాయాలకు కావలసిన నిధులను కేటాయించి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే లబ్ధిదారులకు స్వాధీరపరిచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని లేనియెడల సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో లాటరీ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు మేమే స్వాధీనం చేయిస్తామని హెచ్చరించారు.సీపీఐ(ఎం) పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య మాట్లాడుతూ సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో డిసెంబర్ 13న కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చామని, వారు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పరిశీలించి మౌలిక సదుపాయాలు కల్పించి జనవరి 15 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారన్నారు. కలెక్టర్ ఆదేశాలను కూడా బైకాతరు చేస్తూ అధికారులు అక్కడ ఎలాంటి మౌలిక సదుపాయాల ఏర్పాట్లు చేయకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సాధన పోరాట కమిటీ కన్వీనర్ మాజీ కౌన్సిలర్ ఆవుట రవీందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, అద్దంకి నరసింహ, దండంపల్లి సరోజ, ఊటుకూరు మధుసూదన్ రెడ్డి, పాక లింగయ్య, భూతం అరుణ, గంజి నాగరాజు లతీఫ్, శ్రీనివాస్ జహంగీర్ నగిన , సుల్తాన్, గణేష్ బిక్షపతి శ్రీను, వెంకటేశ్వర్లు, కొల్లోజు శిల్ప సంపూర్ణ ఫర్విన్ సుల్తానా గౌసియా బేగం జావిద్ అన్వర్ బేగం తదితరులు పాల్గొన్నారు.

సురేందర్‌రెడ్డికి ఉద్యోగ విరమణ సన్మానోత్సవం

నవతెలంగాణ-చౌటుప్పల్



చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధా నోపాధ్యాయునిగా పనిచేసిన పాదూరి సు రేందర్‌రెడ్డి జనవరి నెలలో ఉద్యోగ విరమణ చెందారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో సురేందర్‌రెడ్డికి ఉద్యోగ విరమణ సన్మానోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి దంపతులను పూల మాలలు, శాలువాలు, మెమోం టోలతో ఘనంగా స న్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ సురేందర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక నృత్యాలు పలువుర్ని అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంచర్ల హర్షవర్ధన్‌రెడ్డి సభ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి .గురువారావు, ఎంఎన్‌ఓ సీహెచ్.నర్సింగ్‌రావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కె.శివకుమార్, ఎల్లంబావి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఎస్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కులగణన రిపోర్ట్‌ను వ్యతిరేకిస్తూ పున: సమీక్షించాలి

● డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వినతిపత్రం
● బీసీ నేత లింగంగౌడ్

నవతెలంగాణ-మిర్యాలగూడ



రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన సమగ్ర కులగణన రిపోర్ట్‌ను వ్యతిరేకిస్తూ దీనిని పున: సమీక్షించాలని కోరుతూ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మాట్లాడుతూ సమగ్ర కులగణన సర్వే పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని కులగణ సమగ్రంగా, సంపూర్ణంగా, శాస్త్రీయంగా ఎక్కడా జరగలేదని అన్నారు. బీసీల లెక్కను తక్కువ చేసి, అగ్రకులాల జనాభాను ఎక్కువ చూపారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం 42శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించి ఇప్పుడేమో కాకమ్మ కథలు చెబుతూ పార్టీ పరంగా 42శాతం రిజర్వేషన్లు మేము ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కులగణనలో జరిగిన తప్పులను సరిచేయాలని లేదంటే కాంగ్రెస్ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, దోనేటి శేఖర్, నక్క నాగరాజు తదితరులు పాల్గొన్నారు

మంచికంటి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

నవతెలంగాణ-నాంపల్లి



మంచికంటి యాదగిరి చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని నాంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంధం మోహన్‌రావు కొనియాడారు. శుక్రవారం కళాశాలలో ఏర్పాటుచేసిన మంచికంటి వెంకటరమణ సన్మాన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. బోడంగిపర్తి గ్రామానికి చెందిన మంచిగకంటి యాదగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూపాయలు లక్షలు విలువ చేసే ప్రయోగశాల పరికరాలు, రసాయనాలు, ఇతర సామాగ్రిని ఉచితంగా తమ కళాశాలకు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. మారుమూల ప్రాంతాలలో చదివే విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తు అందించాలన్న ట్రస్ట్ లక్ష్యాన్ని ఆయన ప్రశంసించారు. తమ కళాశాలకు అందజేసిన పరికరాలను సద్వినియోగం చేసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అడ్వైజర్ మంచికంటి వెంకటరమణ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందజేస్తామని హామీ ఇచ్చారు. రానున్న వేసవికాలం దృష్ట్యా విద్యార్థుల సౌకర్యార్థం ఫ్యాన్లు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. తమ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద విద్యార్థుల అభ్యున్నతికోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు వెంకన్న, రజనీకాంత్, శ్రీనివాస్, శిరీష, సైదయ్య సృజన్ కుమార్, ప్రసన్న లత, సురేష్, శైలజ, సమత, రజియా బేగం, నరసింహ, శివ పాల్గొన్నారు.

రబీ సాగు ఇబ్బందులపై శాస్త్రవేత్తల పరిశీలన

నవతెలంగాణ-నేరేడుచర్ల

రబీ సాగులో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై శుక్రవారం క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. మండలంలోని పెంచికల్ దిన్న గ్రామంలో చిట్టి రకం విత్తనాల వరి సాగు రైతులు ఇబ్బందులు పడ్డ సంగతి తెలిసిందే. అట్టి పొలాలలో గతంలో మండల వ్యవసాయ అధికారి ఎస్ కే జావేద్ తన సిబ్బందితో పరిశీలించారు. శుక్రవారం పెంచికల్ దిన్న గ్రామంలో ముందస్తుగ పిలకలు వచ్చి ఈనుతున్న వరి పంట పొలాలను కంప సాగర్, కెవికె వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతులు ఇప్పటివరకు ఏ ఏ పద్ధతుల తో సాగు చేశారో అన్ని వివరాలు నమోదు చేసుకోని, పంట సాగువలన రైతులకు కలిగిన ఇబ్బందులను సూర్యాపేట జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పిస్తామని శాస్త్రవేత్తలు వి.శ్రీధర్, కే సంధ్యారాణి, ఏ రాములమ్మలు తెలిపారు. శాస్త్రవేత్తల వెంట వ్యవసాయ విస్తరణ అధికారి స్నేహలత రైతులు ఉన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నకిరేకల్



మున్సిపాలిటీ పరిధిలోని తిప్పర్తి రోడ్డులో యామిని ఆ ధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం సతీమణి వేముల పుష్ప ప్రారంభించారు. అదేవిధంగా బాబన్ సాహెబ్ గూడెంకు చెందిన కన్నెబోయిన లింగయ్య కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన బొడ్డు లచ్చయ్య కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు వారి వెంట మున్సిపాలిటీ చైర్మెన్ చెవుగోని రజిత శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

నవతెలంగాణ-త్రిపురారం

యువత క్రీడల ఆడడడం వల్ల మాన సికోల్లాసం కలుగుతుందని సీఐ జనార్ధన్ గౌడ్ అన్నారు. శుక్రవారం నుండి త్రిపు రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా పోలీస్ శాఖ ఆదేశాలతో మండల పోలీసులు ఆధ్వ ర్యంలో మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి కబడ్డీ పో టీలను నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన వారికి సీఐ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ప్రసాద్, మండల విద్యా అధికారి రవి కుమార్, ఉపాధ్యాయులు రవి, విష్ణు కుమార్, పోలీస్ సిబ్బంది సతీష్, రాము, తదితరులు పాల్గొన్నారు.


నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రిభువనగిరి

శనివారం | ఫిబ్రవరి 08, 2025 | www.navatelangana.com

అభివృద్ధి కోసమే... రాజకీయాల్లోకి వచ్చా..



భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ - భువనగిరి

పలుకుబడి కోసమో, ఆస్తుల సంపాదన కోసమో తాను రాజకీయాల్లోకి రాలేదని, పుట్టి పెరిగిన తన ప్రాంతా అభివృద్ధి కోసమే రాజకీయాల్లోకి వచ్చానని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. భువనగిరి నియోజకవర్గం అన్ని రంగాల్లోనూ సమగ్ర అభివృద్ధి చేసి ఈ ప్రాంత ప్రజల యొక్క నమ్మకాన్ని నిలబెడతానని నవ శకానికి నాంది పలుకుతానని కుంభం అనిల్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. నేడు ఆయన జన్మదినం సందర్భంగా నవతెలంగాణతో మాట్లాడారు...

ఎమ్మెల్యేగా గెలవడం ఎంతో సంతోషాన్నిచ్చింది

భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో నాలుగు దశా బ్దాల తరువాత కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందంటే.. అది కార్యకర్తల కష్టఫలం. ఎమ్మెల్యేగా గెలుపొందడం వ్యక్తిగతంగా నాకెంతో సంతోషానిచ్చింది.

ఏడాది పాలన సంతృప్తికరంగా ఉంది

కాంగ్రెస్ ఏడాది పాలన సంతృప్తికరంగా సాగుతుంది. గత ప్రభుత్వం పదేళ్లలో చేయలేని పనులు సంవత్సర కాలంలో పూర్తి చేశాను. రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ అభివృద్ధి పరచడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేటట్లు చేస్తాను.

మూసీ పునరుజ్జీవం నాకు అతిముఖ్యమైన అంశం

సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో కాలుష్య కోరలో చిక్కుకొని ప్రజల, పశుపక్షాదుల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్న మూసీ పునరుజ్జీవనం కోసం ఇప్పటికే వలిగొండ మండలం గ్రామంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వ హించారు. అంతకుముందు నేను మక్తాఆనంతారం వద్ద వేలాదిమందితో పాదయాత్ర చేపట్టా. మూసీ ప్రక్షాళను చేసి తీరుతాం. సంగెం, శివారెడ్డిగూడెం, ఇంద్రియాల, సిరివేణి కుంట-నందనం బ్రిడ్జిలతో పాటు పక్కారోడ్లు మంజూరు చేయాలని సీఎంను కోరగా నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. భువనగిరి ఖిల్లా అభివృద్ధి, క్రీడా స్టేడియం ఏర్పాటుకు నిధులు మంజూరు చేయించాం. భువనగిరి జిల్లా కేంద్రంలోని ఖిల్లా, వలిగొండ మండలంలోని మత్సగిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయాలను కలుపుకొని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రాలను అభివృద్ధి చేస్తాం

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మల్లన్నసాగర్ నుంచి నీటిని తరలించాలని నిర్ణయించాం. ఇందుకోసం రూ.210 కోట్లతో ప్రత్యే కంగా పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నాం. బస్వాపురం ప్రాజెక్టు కాలువ నుండి వడపర్తి కత్వ ద్వారా చెరువులోకి నీరు తీసుకోవచ్చాం. అమృత్ స్కీంలో భాగంగా భువనగిరి, భూదానపోచంపల్లి మున్సిపాలిటీల్లో రూ.45 కోట్లతో పనులు ప్రారంభించాం. కలుషిత, ఫ్లోరైడ్ నీటినుంచి ప్రజలకు స్వచ్ఛమైన నీరం దించడానికి 50 ప్లాంట్లు ఏర్పాటు చేశాం. మరో 35 ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నాం.

వైద్యసేవలు మెరుగుపడ్డాయి

నేను రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత నిమ్స్ తర్వాత ఎయిమ్స్ లో వైద్య సేవలు మెరుగుపరచాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేశాను. అందులో భాగంగాప్రభుత్వ ఆస్పత్రులో వైద్యసేవలు మెరుగుపడ్డాయి. మెడికల్ కళాశాల, నర్సింగ్ కళాశాలలను ప్రారంభించుకున్నాం. ఎయిమ్స్ వైద్య సేవలు మరింత మెరుగుపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సహకారం అందిస్తున్నాం. జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రూ.220 కోట్లతో అదనపు భవనాలు నిర్మిస్తున్నాం. ఐసీయూ, మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నాం. పీహెచ్‌సీలలో, బస్తీ దవఖానాలలో వైద్య సేవలు మెరుగుపడ్డాయి,

సాగునీటికి ప్రాధాన్యం

నియోజకవర్గంలో 70 వేల ఎకరాలకు సాగునీరు అందించే చిన్న నీటి వనరులు తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం చేకూరే మూసీ కాలువల ఆధునీకరణకు నిధులు మంజూరు చేయించాను. బునాదిగాని కాలువకు రూ.269 కోట్లు, పిలాయిపల్లి, ధర్మారెడ్డి కాలువలకు రూ.225 కోట్లు మంజూర య్యాయి. ఇందులో బునాదిగాని కాలువ పనులకు టెండర్ ప్రక్రియ మొదలైంది. భీమలింగం, బొల్లేపల్లి, అలీనగర్ కాలువలన ఆధునీకరణకు ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించా. నిధుల మంజూరులో సీఎం రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, తన నియోజకవర్గానికి ఆనుకొని ఉన్న ఎమ్మెల్యేలు సహకారం ఉంది.

ముంపు గ్రామాలకు రూ.200 కోట్లు మంజూరు చేయించా

బస్వాపురం రిజర్వాయర్ ముంపు గ్రామాల ప్రజలకు పరిహారం, ఆర్అండ్ ప్యాకేజీ కోసం ప్రభుత్వంతో మాట్లాడి రూ.200 కోట్లు మంజూరు చేయించాను. ఇందులో ఇప్పటికే రూ.50 కోట్లు విడుదల చేసింది.

ఇక నుంచి మరింత సమయం కేటాయిస్తా..

పార్టీ విజయం కోసం కష్టపడ్డ వారికి నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటికే పలువురికి పార్టీ పదవులతో పాటు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విభాగాల్లో, మార్కెట్ కమిటీలలో, దేవాదాయ ధర్మాదాయ శాఖ దేవాలయ, గ్రంథాలయ అభివృద్ధి కమిటీలలో ల పదవులు వరించాయి. మరికొందరికి పదవులు దక్కను న్నాయి. కార్యకర్తలు, ప్రజలకు ఇక నుంచి మరింత ఎక్కువ సమయం కేటాయిస్తాం. ప్రభుత్వం అధికారులు, ప్రజలకు వారధిలా పనిచేసి వచ్చే నాలుగేళ్లలో నవశ కానికి నాంది పలుకుతా.

త్రిప్టు పథకం చేనేత కార్మికులకు ఆసరా



నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

ప్రజా పాలన ప్రజల ప్రభుత్వం కాంగ్రెస్ నిరంతరం ప్రజా సంక్షేమ కోసం ఎంతో కృషి చేస్తుంది. భువనగిరి.శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి నిరంతరం ప్రజల సంక్షేమం కోసం చేనేత కార్మికుల కోసం కార్మికుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు చేనేత త్రిప్టు పథకం ద్వారా కోట్లాది రూపాయలు చేనేత కార్మికులకు అందజేశారు. కోట్లాది రూపాయలతో పోచంపల్లి అభివృద్ధి చేయడంలో అనిల్ కుమార్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారు

-సూర్య పెల్లి రాము, పద్మశాలి యువజన సంఘం గౌరవాధ్యక్షులు

10న ఇందిరా పార్క్ వద్ద ధర్నాను జయప్రదం చేయండి

- ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి



నవతెలంగాణ-క్లాక్‌టవర్

కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక బడ్జెట్‌కు నిరసనగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ 10న ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నా, సభను జయప్రదం చేయవలసిందిగా అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభావతి కోరారు. ఈరోజు ఐద్వా నల్గొండ జిల్లా కమిటీ సమావేశం పోలేబోయిన వరలక్ష్మి అధ్యక్షతన స్థానిక దొడ్డి కొమురయ్య భవనంలో జరిగింది ఈ సందర్భంగా ప్రభావతి మాట్లాడుతూ మహిళలకు బడ్జెట్లో సరి ఒక వాటా దక్కలేదని అన్నారు విద్యా వైద్యం ఉపాధి మహిళా సంక్షేమానికి అధిక నిధులు కేటాయించాల్సిందిగా డిమాండ్ చేశారు కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు దోచిపెడుతుందని పేద మధ్యతరగతి వర్గాల పైన పన్నుల భారం అధికంగా వేసిందని అన్నారు తెలంగాణ రాష్ట్రానికి బడ్జెట్లో తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు ఇప్పటికైనా బడ్జెట్ సవరించి తెలంగాణకు నిధులు కేటాయించి అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. ప్రతిపక్ష రాష్ట్రాల పైన సవతి తల్లి ప్రేమ చూపించడం కరెక్ట్ కాదని తెలియజేశారు. రేపు ఇందిరాపార్క్ వద్ద 10న పెద్ద ఎత్తున ధర్నా నిరసన కార్యక్రమం చేపట్టినట్లు అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు కొండ అనురాధ జిట్టా సరోజ జిల్లా ఆఫీసు బేరర్స్ భూతం అరుణకుమారి పాదూరి గోవర్ధన కారంపూడి ధనలక్ష్మి ఎస్కే సుల్తానా దామెర లక్ష్మీ జిల్లా కమిటీ సభ్యులు కనుకుంట్ల ఉమారాణి జంజరాల ఉమా నాగమణి అరుణ పాల్గొన్నారు.

భువనగిరి ఖిల్లా పై కాంగ్రెస్ జెండా

- చరిత్రను తిరగరాసిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు




నవ తెలంగాణ- భూదాన్ పోచంపల్లి

తెలంగాణ రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూలు విడుదల నాటినుండి పోలింగ్ వరకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఎంతో కృషి ఫలితమే భువనగిరి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుంభంఅనిల్ కుమార్ రెడ్డి 26, 201 భువనగిరి కిల్లా పై విజయం సాధించారు భువనగిరి అసెంబ్లీ నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ 40 సంవత్సరాల నుండి అభ్యర్థులుపోటీ చేస్తున్నప్పటికీ గెలవకపోవడం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరుణంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కుంభ అనిల్ కుమార్ రెడ్డి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓటమిపాలైనప్పటికీ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రజల కు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై నిరంతరం ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చి ఈ ప్రాంత ప్రజలసమస్యలపై ఉద్యమాలు చేపట్టి వారి సమస్యలను పరిష్కారమయ్యే వరకు పోరాడిన వారు.. నేనున్నాను ప్రతి ఒక్కరిని ఆప్యాయత.చిరునవ్వుతో పలకరిస్తూ ప్రజల మనసును గెలుచుకున్నారు.

భూదాన్‌పోచంపల్లి మండల అభివృద్ధికి కృషి

భూదానోద్యమ చరిత్ర కలిగిన, చేనేతకు ప్రసిద్ధి చెందిన భూదాన్ పోచంపల్లి మండలాన్ని మరింత అభివృద్ధి చేసి అగ్రస్థానంలో నిలిచే విధంగా ప్రణాళికలు రూపొందిస్తూ అధిక నిధులు వెచ్చించి మండలాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేస్తున్నారు. కోట్లాది రూపాయలతో బీటీ రోడ్లు సీసీ రోడ్లు మౌలిక వసతులు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ భరోసా సంక్షేమ పథకాలు ,రెండు లక్షల రుణమాఫీ రైతు భరోసా రేషన్ కార్డులు ,కళ్యాణ లక్ష్మి ఉచిత విద్యుత్తు సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసీ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది.

పోచంపల్లి అభివృద్ధికి కృషి చేసిన ఎమ్మెల్యే



ప్రజా పాలన ప్రజా ప్రభుత్వంలో పోచంపల్లి మండలానికి అధిక నిధులు వెచ్చించి గ్రామాల్లో విజిఎస్ ద్వారా కోటి రూ.64 లక్షల తో సీసీ రోడ్లు ,89 కోట్లతో పిలాయిపల్లి కాల్వ పనులు చేపట్టనున్నారు. 20 లక్షలతో జలాల్‌పురం చెరువు మరమ్మతులు, కోట్లాది రూపాయలతో హైదరాపూర్ భీమనపల్లి కనుముక్కల వరకు రోడ్ల పనులు వంకమామిడి చేవెళ్ల బిటి రోడ్లు రేవనపల్లి నుండి పెద్ద రావుల పల్లి వరకు రోడ్ల మరమ్మతులు, దేశ్ముఖ్ నుండి పిలాయిపల్లి బీటీ రోడ్డు పిల్లాయిపల్లి నుండి జూలూరు వరకు బీటీ రోడ్డు మరమ్మతులు చేపట్టాం.

-పాక మల్లేశం, కాంగ్రెస్ మండల అధ్యక్షులు

కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి



ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఆకాంక్షతో జూలూరు గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కోట్లాది రూపాయలను నిధులు మంజూరు చేయించి గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నారు..2కోట్లతో జూలూరు పిల్లాయిపల్లి రోడ్లు పనులు ప్రారంభమయ్యాయి 20 లక్షల తో సిసి రోడ్లు వాటర్ ఫిల్టర్ హెచ్ఎండి నిధులు కోటి రూపాయలతో జూలూరు గ్రామాన్నిఅభివృద్ధి పనులు వీధిలైట్లు కళ్యాణ లక్ష్మి సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి.సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా అందజేస్తున్నారు .

-కాసుల అంజయ్య కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్

ప్రజలకు సంక్షేమ పథకాలు



ప్రజా పాలన ప్రజా ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి .మున్సిపల్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించి మరింత అభివృద్ధి చేసేందుకు చేనేత కార్మికుల సంక్షేమ కోసం త్రిఫ్ట్ పథకం ద్వారా వేలాది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించారు. నిధులు మంజూరు చేయించి టూరిజం డెవలప్‌మెంట్ పర్యాటక కేంద్రంగా చేనేత అభివృద్ధి కోసం నిరంతరం కుంభం అనిల్ కుమార్ రెడ్డి కృషి చేస్తున్నారు.

- కర్నాటి బాలరాజు, టై అండ్ డై గౌరవాధ్యక్షులు

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

కాంగ్రెస్ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా కల్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్ఓసి ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుంది. ఇండ్లు లేని ప్రతి పేదవానికి ఇందిరమ్మ భరోసా పథకం ద్వారా ఎంతో మందికి లబ్ధి చేకూరుతుంది. ఎన్నో ఏళ్ల నుండి ఎదురుచూస్తున్న అర్హులైన పేదలకు రేషన్ కార్డులు, పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుంది.

- డీసీసీ జిల్లాఉపాధ్యక్షులు సామ మధుసూదన్ రెడ్డి

విద్యా రంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు



మర్రిగూడలో..

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్

నవతెలంగాణ-మర్రిగూడ

విద్యా రంగ సమస్యలపై రాజీలేని పోరాటాలను నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కంభంపాటి శంకర్ అన్నారు.గురువారం మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహంలో ఈనెల 19,20 తేదీలలో జిల్లా కేంద్రంలో నిర్వహించబోయే ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల కరపత్రావిష్కరణ సందర్భంగా ఆయన మాట్లాడారు.గత సంవత్సరం కాలం పాటు నిర్వహించిన విద్యార్థి ఉద్యమాల ద్వారా సాధించిన విజయాలను,జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న విద్యా రంగ సమస్యలపై భవిష్యత్ పోరాటాలకు కార్యాచరణ రూపొందించి జిల్లా వ్యాప్తంగా విద్యారంగ సమగ్ర అభివృద్ధి కోసం ఈ సభల్లో చర్చించబోతున్నామని అన్నారు. పెండింగ్ బకాయిలో ఉన్న 8350 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సంపత్, కుమార్, మనోజ్, వరుణ్,సైదా,మణి,ప్రశాంత్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేశ్, జిల్లా మాజీ కార్యదర్శి మల్లం మహేశ్ అన్నారు. శుక్రవారం నార్కట్ పల్లి లో ప్రభుత్వ జూనియర్ కళాశాల,స్ఫూర్తి జూనియర్ కళాశాలలో నూతన కమిటీలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ



నార్కట్‌పల్లిలో..

రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. విద్యార్థులకు అందవలసిన స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నదన్నారు. వెంటనే విడుదలచేసి విద్యార్థులను ఆదుకోవాలని కోరారు.



చింతపల్లిలో..

ఈనెల 19 ,20 తేదీలలో నల్గొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే 45వ జిల్లా మహాసభలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం కోసం మహాసభలను జయప్రదం చేయాలని కోరారు . ఈకార్యక్రమంలో నకిరేకల్ డివిజన్ కార్యదర్శి ముక్కు రవిందర్ పాల్గొన్నారు.

చింతపల్లి : నల్గొండలో జరిగే ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా 45వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు రామావత్ లక్ష్మణ్,బుడిగ వెంకటేష్ అన్నారు.శుక్రవారం మహాసభల కరపత్రాలను చింతపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విడుదల చేశారు. ఈ మాహసభలో మేధావులతో విద్యార్థులతో చర్చించి రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై సానుకూలంగా చర్చలు జరిపి భవిష్యత్తు కార్యక్రమాలకు సిద్ధం అవుతమన్నారు. ఈ కార్యక్రమం లో ఆంజనేయులు, మనోజ్, గురు, శ్రీకాంత్, కవిత, శారద, స్వాతి,మౌనిక, త్రిష తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనల ప్రకారమే జాతర నిర్వహించుకోవాలి



నవతెలంగాణ-చిలుకూరు

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారమే కనకదుర్గమ్మ జాతర నిర్వహించుకోవాలని చిలుకూరు ఎస్ఐ సురభి రాంబాబు గౌడ్ సూచించారు. శుక్రవారం మండలంలోని జెర్రిపోతల గూడెం గ్రామంలో జరిగిన అఖిలపక్ష కనకదుర్గమ్మ జాతర సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడారు. జాతరలో ఎటువంటి డీజేలు డాన్సులు, రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు నిషేధిస్తున్నామన్నారు. జాతరను ఎటువంటి గొడవలకు తావులేకుండా శాంతియుతంగా నిర్వహించుకోవాలన్నారు. జాతరలో ఎన్నికల నియమ నిబంధనలను వ్యతిరేకించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

10న వికలాంగుల పింఛన్ పెంపు కోసం ధర్నా



నవతెలంగాణ-భువనగిరి

వికలాంగుల పెన్షన్‌లో కేంద్ర ప్రభుత్వం వాటా రూ. 5000లకు పెంచాలని, 2025-26 బడ్జెట్‌లో 5శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 10న ఢిల్లీలో ఎన్‌పీఆర్‌డీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న వికలాంగుల మహాధర్నాకు యాదాద్రి భువనగిరి జిల్లా నుండి ఎన్పీఆర్డీ నాయకులు, కార్యకర్తలు,వికలాంగులు శుక్రవారం తరలివెళ్లారు.ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో వికలాంగులకు అన్యాయం చేసిందని అన్నారు. పెన్షన్ పెంపు కోసం బడ్జెట్లో నిధులు కేటాయించకుండా మోసం చేసిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక పథకాలకు నిధులు కేటాయించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందన్నారు.మోడీ ప్రభుత్వం పాలనలో వికలాంగులు అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు.ఇందిరాగాంధీ నేషనల్ వికలాంగుల పెన్షన్ స్కీం వికలాంగులందరికి వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లేపల్లి స్వామి, జిల్లా కోశాధికారి కొత్త లలిత, జిల్లా ఉపాధ్యక్షులు మెరుగు బాబు, డివిజన్ కార్యదర్శి గడ్డం యాదగిరి, జిల్లా నాయకులు వేముల భిక్షం, మండల అధ్యక్షులు ఎర్రవెల్లి నాగేశ్వర్, పండాల శ్రీహరి ,పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వీఆర్ కళాశాల నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఆలేరు టౌను

ఆలేరు మండల కేంద్రంలో శుక్రవారం (వెంకటరమణ) వీఆర్ జూనియర్ కళాశాల నూతన భవనాన్ని ప్రభుత్వవిప్ బీర్ల ఐలయ్య, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ప్రారంభించారు.కళాశాల యజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ఆటపాటలతో అలరించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి,కళాశాల నిర్వాహకులు, ప్రిన్సిపాల్ నాలం అయ్యప్ప, చైర్మెన్ కటకం నందం, వైస్‌చైర్మెన్ కటకం సంపత్, మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్, కాంగ్రెస్ మండల, పట్టణ



అధ్యక్షులు కే వెంకటేశ్వరరాజు, ఎంఎ ఎజాజ్, కాంగ్రెస్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీగా పూల రవీందర్‌ను గెలిపించాలి'



నవతెలంగాణ-కోదాడటౌన్

ఈ నెల 27న జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జాక్టో అభ్యర్థి పూల రవీందర్‌ని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని జాక్టో సెక్రటరీ జనరల్ కే కృష్ణుడు, ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు ఎం పర్వత రెడ్డి అన్నారు. శుక్రవారం కోదాడ డివిజన్‌లో ప్రచారం అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల సమస్యలు, ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలు పరిష్కారం కావాలంటే పూల రవీందర్ ని గెలిపించాలన్నారు. పెండింగ్లో ఉన్న బిల్లులు, డిఏలు, పిఆర్సి, ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్లు, మోడల్ స్కూల్ లో పనిచేసే టీచర్లకు జీతాల చెల్లింపు, కేజీబీవీ టీచర్లకు టైం స్కేలు, రెగ్యులరైజేషన్, ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయ, అధ్యాపకుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థ, పాఠశాలలు బలోపేతం కావాలంటే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్ ని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు ఓరుగంటి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బంధం వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు ఓరుగంటి పెద్ద నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



నవతెలంగాణ-కోదాడటౌన్

కోదాడ పట్టణ పరిధిలోని బాలాజీ నగర్‌లో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాల వసతి గృహంలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాటలను బోధించారు.విద్యార్థులు కలెక్టర్ గా,జిల్లా విద్యాధికారిగా, ప్రధానోపాధ్యాయులుగా, ఉపాధ్యాయులుగా అలరించారు. ఈ సందర్భంగా వసతిగృహ సంక్షేమ అధికారి, ప్రధానోపాధ్యాయురాలు కే నాగజ్యోతి మాట్లాడుతూ విద్యార్థులు చిన్ననాటి నుండి లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటి సాధన కొరకు నిరంతరం కృషి చేయాలి అన్నారు. తమపై తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాలను నెరవేర్చాలన్నారు. వసతి గృహాల్లో ప్రభుత్వం మెరుగైన వసతులు కల్పిస్తుందని వాటిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉషారాణి, సుజాత, రేణుక, పద్మాబాయి, స్వరూప, రేణుక, ప్రియాంక, స్వాతి, నాగేశ్వరరావు, సరిత, లలిత పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంలో పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా చెరువుగట్టు గ్రామానికి చెందిన దయ్యాల మల్లయ్యకి రూ. 60,000, కొమ్ము సాయికు మార్‌కి రూ.41,000ల చెక్కులను గురువారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో పార్టీల కతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఛైర్మన్ రెగట్టే రాజ శేఖర్ రెడ్డి, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు వారాల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్ గడుసు శశిధర్ రెడ్డి, మండల కాంగ్రెస్ నాయకులు రేగట్టె నవీన్‌రెడ్డి, మల్గ శంకర్, యువజన కాంగ్రెస్ నాయకులు కనకూట్ల శ్రీకాంత్, గౌరీదేవి రాజు, గాదరి వెంకట్, వంటేపాక శేఖర్, బింపాక శంకర్, వనం సతీష్ పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు జెర్సీలను అందజేసిన బింగి మహేష్

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

మండల కేంద్రంలో తొండలవాయి గ్రామానికి చెందిన బింగి మహేష్ వారి నాన్న తిరుమలేష్ జ్ఞాపకార్థంగా శుక్రవారం కబడ్డీ క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించి మంచి పేరు తేవాలని ఆకాంక్షిస్తూ మా సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

శ్రీమడేలయ్య దేవాలయానికి దర్వాజా వితరణ

నవతెలంగాణ-చండూర్

గట్టుపల మండలంలోని అంతంపేట గ్రామంలో రజకుల కుల దైవమైన శ్రీమడేలయ్య దేవాలయానికి మండల బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షులు వీరమల్ల రాజుగౌడ్ తన సొంత ఖర్చుతో రూ.20వేలతో గుడికి దర్వాజా శుక్రవారం విచారణ చేశారు. అనంతరం గుడి దగ్గర దర్వాజా పూజా కార్యక్రమాలు చేసి దర్వాజా లేవనెత్తారు. రజక సంఘం నాయకులు ఆయనకు శాలువాకప్పి సన్మానం చేశారు. మరి కొంతమంది దాతలు ముందుకు వచ్చి దేవాలయ మరింత అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంతంపేట గ్రామ పెద్దలు యువజన నాయకులు, మడేలయ్య కుల పెద్దలు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ జెడ్పీటీసీ

నవతెలంగాణ- నార్కట్‌పల్లి

పట్టణానికి చెందిన బైరోజు చందన వెంకటేశ్వర్లు కుమార్తె బైరోజు కావ్య వివాహం శుక్రవారం జరగగా మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య యాదవ్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గూడూరు అంజిరెడ్డి శ్రీను బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-చిట్యాల

మండల పరిధిలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన పాలెం సంజీవ కుమార్తె వివాహం శుక్రవారం పట్టణ పరిధి ఫంక్షన్ హాల్ లో జరిగిన వేడుకకు నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వెలిమినేడు గ్రామానికి చెందిన గుర్రం జంగయ్య కుమారుడి జన్మదిన వేడుకలకు ఆయన హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కాటం వెంకటేశం, జడల చిన్న మల్లయ్య, ఎద్దుల పూరి కృష్ణ, ఏర్పుల పరమేశం, అంతటి నరసింహ పారిజాత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం

ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చింతాబాబు మాదిగ

నవతెలంగాణ-కోదాడటౌన్

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తూ చట్ట సభల్లో బిల్లు ఆమోదించడాన్ని స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చింతా బాబు మాదిగ తెలిపారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని వారి నివాసంలో ఏర్పాటుచేసిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. దశాబ్దాల కాలంగా వర్గీకరణకై ఎన్నో పోరాటాలు చేశామని సుప్రీంకోర్టు తీర్పు మేరకు మాదిగల చిరకాల కోరిక అయిన ఎస్సీ వర్గీకరణ చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు ఉప సంఘం చైర్మన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి, వైస్ చైర్మన్ దామోదర రాజనర్సింహ లతో పాటు ఉద్యమ నాయకులు మందకృష్ణ మాదిగ, మేడి పాపయ్య మాదిగలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సామాజికంగా విద్యా పరంగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన పంబాల, మన్నే కులాలను క్యాటగిరి ఏ నుంచి తొలగించి సీ కేటగిరీలో చేర్చాలని బలహీనులుగా ఉన్న బుడగజంగాలు, డక్కలి కులాలను ఏ క్యాటగిరిలో ఉంచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కోదాడ నియోజకవర్గ ఇన్చార్జి బాణాల అబ్రహం, జిల్లా ఉపాధ్యక్షులు కందుకూరి నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బొల్లెపోగు స్వామి, నారకట్ల ప్రసాద్, చిలుకూరు మండల అధ్యక్షులు బొల్లె పోగు కాశయ్య, పిడమర్తి బాబురావు, సోమపొంగు శ్రీను, ఏర్పుల చిన్ని, చంటి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

నవతెలంగాణ-ఆత్మకూర్ ఎస్

మండలంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో యూరియా లభ్యత రైతులకు సరఫరా గురించి మండల వ్యవసాయ అధికారి డి.దివ్య తనిఖీ చేశారు. శుక్రవారం నెమ్మికల్ పిఏసిఎస్‌లో 444 యూరియా బస్తాలు ఏపూర్ పీఏసీఎస్‌లో 444 బస్తాల యూరియా రైతులకు అందుబాటులో ఉందని తెలిపారు. రైతులు యూరియాను సీజన్ మొత్తానికి ఒకేసారి కొనుగోలు చేయకుండా యూరియా వేసే విడతల వారిగా కొనుగోలు చేయాలని సూచించారు. ఎప్పటికప్పుడు వచ్చిన యూరియాను రైతులకు పంపిణీ చేయగానే తర్వాత రైతులకు సరఫరా చేయటానికి యూరియాను తెప్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ సిఈఓ పట్నం లక్ష్మారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బేగంపేటలో కుట్టుమిషన్ శిక్షణా కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలం బేగంపేట గ్రామంలో మహిళ యువతకు టైలరింగ్ నేర్చుకోవడానికి కుట్టు శిక్షణాకేంద్రాన్ని శుక్రవారం ఆరుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో బేగంపేట గ్రామంలో కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవానికి ఆరుట్ల కమలాదేవి కోడలు సుశీలమ్మ హాజరై ప్రారంభించి మాట్లాడారు. మహిళలు,యువతులు ఈ కుట్టు శిక్షణ కేంద్రం నేర్చుకుని సక్రమమైన పద్ధతిలో ఉపయోగించుకుంటే స్వామి రామానంద ట్రస్టు ద్వారా శిక్షణ నేర్చుకున్న వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేస్తామన్నారు. గ్రామంలోని వృద్ధులకు ఆసరాగా చేతి కర్రలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొని కమ్యూనిస్టు పార్టీ జిల్లా నాయకులు కొల్లూరి రాజయ్య,మండల కార్యదర్శి చిగుళ్ల లింగం మాట్లాడుతూ ఆరుట్ల రామచంద్రారెడ్డితో పని చేసిన చరిత్ర బేగంపేట గ్రామానికి ఉందన్నారు.నాడు భూ పంపకం చేయడంలో వ్యక్తీ తొలగించడంలో బద్దం నరసింహారెడ్డి మూలబాలయ్య, బలిజ వీరయ్య, జిట్ట రామచంద్రారెడ్డి, చిగురుల మల్లయ్య వీరందరూ ఆరుట్ల రామచంద్రారెడ్డి స్థలంలో పనిచేసిన చరిత్ర ఈ గ్రామానికి ఉన్నదన్నారు. ఇటువంటి సేవాదృక్పథం ఉన్నందుకు ఆరుట్ల ఫౌండేషన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేష్,గ్రామ కార్యదర్శి మూల హరినాథ్,బాబుపేట వెంకటయ్య, మూలపోచయ్య, వెంకటయ్య, రైతుసంఘం మండలనాయకుడు ఉగ్గుకరుణాకర్‌లు సుశీలమ్మను సన్మానించారు.ఈ కార్యక్రమంలో జంగం శ్రీశైలం, శివప్రసాద్, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మూలం సంతను విజయవంతం చేయండి

నవతెలంగాణ-పెద్దవూర

గ్రామభారతి 28 వసంతాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భాన గ్రామ భారతి, సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నేడు హైదరాబాద్‌లోని తార్నాకలో మర్రి కృష్ణా హాల్ నందు మూల సంత ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలంగాణ గ్రామ భారతి రాష్ట్ర అధ్యక్షురాలు సూర్య కళ శుక్రవారం గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్తూ పెద్దవూరలో నవతెలంగాణ తో మాట్లాడారు.రైతులు, చేతివృత్తులు, విలువజోడింపు చిరు ఉత్పత్తిదారులు నేరుగా వినియోగదారులకు అమ్ముకోవటానికి ప్రత్యేక వేదిక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.గత నెలలో కూడా మూల సంత ఏర్పాటు చేశామని తెలిపారు.ప్రకృతి, పాడి, సాహిత్యం, ఆయుర్వేద, పంచగవ్య, కుల వృత్తులు, చేతి వృత్తులు ఇతరత్రా వారిని ప్రోత్సహిస్తూ జై జవాన్ జై కిసాన్ నినాదంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కావున అందరూ కుటుంబసమేతంగా విచ్చేసి కార్యక్రమాన్ని మరలా విజయవంతం చేయగలరని తెలిపారు. ఈ సంతలో ఆరోగ్య కరమైన మిల్లట్ ఆహారం, నోరురించే మిల్లెట్, ఐస్ క్రీమ్, గోమయ రాఖీలు, ప్రమిదలు, పేంట్ పుట్టి యోగామాట్, మట్టిగణపతులు, ఖాదీ చేనేతచీరెలు వస్త్రాలు, ఉచిత దవాచాయ్ వంటివి ప్రత్యేక ఆకర్షణలుగా ఉంటాయాని తెలిపారు. వీటికి గాను స్టాల్స్ కావాలసిన వారు టేబుల్, కుర్చీలు, శుభ్రత, కరెంట్ వంటి ఏర్పాట్లకోసం కేవలం రూ.300 హాల్ వారికి జమచేయవలసి ఉంటుందని తెలిపారు.మరిన్ని వివరాలకు సంతలో స్టాల్ పెట్టుదలచినవారు 91 94908 50766 లేదా 6305-182620 నెంబర్లపై ఫోన్ చేసి ముందస్తు దరఖాస్తు చేసుకొని, గ్రామ భారతి వారి సమ్మతం తప్పనిసరిగా తీసుకోగలరనికోరారు.

మంకీ గన్ వాడకం, వరిలో సమగ్ర సస్యరక్షణ పై అవగాహన

నవతెలంగాణ-రాజపేట

ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుండి నాలుగో సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు స్ఫూర్తి, జి. స్రవంతి, టి . నిషిత, నజ్రానా బృందం శుక్రవారం రాజపేట మండలంలో కోతుల బెడదకు చెక్ పెట్టేలా మంకీ గన్ వాడకంపై రైతులకు ప్రజలకు అవగాహన కల్పించారు. వరిలో సమగ్ర సస్యరక్షణపై అవగాహన కార్యక్రమం, ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఎక్కువగా వరిని సాగు చేస్తున్న కారణంగా వ్యవసాయంలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు కే.స్ఫూర్తి, జి.స్రవంతి, టి.నిషిత, నజ్రానా వరిలో క్రిమీ కీటకాలను నివారించేందుకు వివిధ మార్గాలను రైతులకు తెలిపారు.వారి అనుమానాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా ప్రజలు, రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

చేడు వ్యసనాలకు లోను కావద్దు

నవతెలంగాణ-దామరచర్ల

విద్యార్థులు గంజాయి వంటి చెడు వ్యసనాలకు లోను కావద్దని ఉపాధ్యాయుల విద్యాబోధనను సక్రమంగా అలవర్చుకొని స్వశక్తిగా ఎదిగేందుకు కృషి చేయాలని హెడ్ కానిస్టేబుల్ నాగిరెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్ ఆదేశాల మేరకు మిషన్ పరివర్తన్ యువతేజం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు ఆడటం వలన యువకులు తమ లక్ష్యానికి చేరుకోవచ్చుని, పోలీసులకు యువతకు మధ్య స్నేహభావం పెంపొందించాలని క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు భాస్కర్ ,ఖయ్యూం, కోటయ్య, సతీష్ ,కార్తీక్ ,సైదులు, గోపాలకృష్ణ, హెూంగార్డులు చంద్రశేఖర్, చంద్రశేఖర్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సన్మానం

దామరచర్ల : ఉత్తమ అవార్డు పొందినందుకు మండల వైద్యాధికారి నాగేశ్వరరావు ను మండల ఆశా కార్యకర్తల అద్వర్యం లో శుక్రవారం ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పలువురు ఆశా కార్యకర్తల తోపాటు సిఐటియు మండల కార్యదర్శి దయానంద తదితరులు పాల్గొన్నారు.

సేఫ్టీ మోకులు ప్రతి గీత కార్మికుడు వినియోగించుకోవాలి

నవతెలంగాణ-చండూర్

సేఫ్టీ మోకులు ప్రతి గీత కార్మికుడు వినియోగించుకోవాలని చండూరు ఎక్సైజ్ ఇంచార్జ్ సీఐ కుర్మ నాయకులు, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ గౌడ్ అన్నారు. శుక్రవారంచండూరు మండల పరిధిలోని బోడంగిపర్తి గ్రామంలోసేఫ్టీ మోకులపైగీత కార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సేఫ్టీ మోకులు వినియోగించడం వలన ప్రతి గీత కార్మికుడు తాటి చెట్టు ఎక్కేటప్పుడు ప్రమాదం నుండి బయటపడాలంటే కాటమయ్య రక్షణకవచం చాలా అవసరమని ప్రతి గీత కార్మికుడు వినియోగించుకోవాలనివారు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల కోసం సేఫ్టీ మోకులపై తీసుకున్న నిర్ణయాన్ని గీత కార్మికులు అందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారులు రామారావు, రాకేష్, ఎక్సైజ్ కానిస్టేబుల్ ప్రభాకర్, నల్లగొండ టీంట్రైనర్స్ వీరయ్య, శంకర్ గీత కార్మికులు అంజయ్య, నరసింహతదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుని కలిసిన మండల నాయకులు

నవతెలంగాణ-పెద్దవూర

భారతీయ జనతా పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షులుగా రెండవ సారి నియమితులైన డాక్టర్ నాగం వర్షిత్ రెడ్డిని శుక్రవారం పెద్దవూర మండల సీనియర్ బీజేపీ నాయకులు జిల్లా పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో ఘన సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా సీనియర్ నాయకులు కంభంపాటి కృష్ణ, నాగార్జున సాగర్ నియోజకవర్గ నాయకులు పాల్తి శంకర్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి చిట్టి మల్ల సరేష్, జనరల్ సెక్రెటరీ పల్లబోయిన ఆంజనేయులు, నాయకులు జూలకంటి మట్టరెడ్డి, కుంటిగొర్ల రాజశేఖర్, రమావత్ శ్రీరాములు తదితరులు

రమాబాయి అంబేద్కర్ జయంతి శుభాకాంక్షలు..!

నవతెలంగాణ-పెద్దవూర

భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా.బాబా సాహెబ్ అంబెడ్కర్ సతీమణి మాత రమాబాయి అంబేద్కర్ జయంతి సందర్బంగా బుసిరెడ్డి పౌండేషన్ ఛైర్మెన్ పాండు రంగారెడ్డి శుక్రవారం నాగార్జునసాగర్ నియోజకవర్గ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈసందర్బంగా మాట్లాడుతూ విజయవంతమైన పురుషుడి వెనుక, ఒక స్త్రీ ఉంటుంది. అంబేడ్కర్ జీవితంలోనూ ఆయన భార్య రమాబాయి ఆయనను బాగా ప్రభావితం చేసిందని అన్నారు.ఫిబ్రవరి 7,1898న ఆమె ఒక నిరుపేద దళిత కుటుంబంలో జన్మించారు. ఆమె 15 సంవత్సరాల వయసులో బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను వివాహం చేసుకున్నారు. రమాబాయి లాంటి చాలా విధేయతగల జీవిత భాగస్వామిని పొందిన బాబాసాహెబ్ అదృష్ట వంతుడని అన్నారు. సామాజిక న్యాయం, సంస్కరణల కోసం రమాబాయి తన భర్త చేపట్టిన పోరాటాన్ని చేపట్టి, ఆయన ప్రారంభించిన గొప్ప పనిని నిర్వహించడానికి అతనితో పాటు ఒక శిలలా నిలబడిందని కొనియాడారు.

12న వేణుగోపాల స్వామి కల్యాణం

నవతెలంగాణ-గరిడేపల్లి

మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి వార్షిక కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ సందర్భంగా 11వ 12వ తేదీలలో దేవాలయంలో ప్రత్యేక పూజలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు కాకులపాటి కృష్ణవంశీ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. దేవాలయంలో భక్తులకు అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.